# ఉత్పత్తుల కార్యకలాపాలు ప్రభావితం..!

నేటినిజం
శనివారం 3-8-2019

ఆహార ధాన్యాలు , ఇంకా ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ద్రవ్యోల్బణ తీవ్రత అధికమవుతోంది. నిత్యావసరాల ధరలకు సామాన్యుడు కొనలేక సతమతమవుతున్నాడు. ఒకప్పుడు రూపాయికి ఒక డాలరు లభించిన రోజులు, డాలరు విలువ 62 రూపాయలకు మించిపోయింది. రూపాయి కొనుగోలు శక్తి క్రమంగా క్షీణిస్తోంది. అవసరమైన ఆహారధాన్యాలను , నిత్యావసర వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకుని స్వయంసమృద్ధితో ఆర్థిక స్వావలంబన చేసుకునే దిశగా కృషి అవసరమన్నారు గాంధీజీ. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా, ఈ ఆలోచనలకు పొంతన లేకుండా విదేశీ వస్తువుల పట్ల మోజు నానాటికీ అధికమవుతోంది. సరళీకృత ఆర్థిక విధానంలో చైనా బియ్యం నుంచి ఆఫ్రికా బంగారం వరకు దిగుమతులు ఎక్కువైపోతున్నాయి. సుంకం పెంచడం ద్వారా బంగారం దిగుమతులను కొంత వరకు నియంత్రించారు. ఇతర దిగుమతులు కొనసాగుతూనే ఉన్నాయి. విదేశీ వ్యాపార లోటు కంటె మనదేశ వ్యాపార లోటు చాలా తక్కువగా ఉంది. ఇదే ఆందోళన పడాల్సిన విషయం. రూపాయి పతనానికి వ్యవసాయం సమస్యల వలయంలో చిక్కుకోవడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. 2008-2009 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం మనదేశ ఆర్థిక వ్యవస్థపైన పడింది. ఇందుకు రిజర్వుబ్యాంకును అనుసరిస్తున్న ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశీ వ్యాపార విధానాలు కారణాలు కావచ్చు. ప్రపంచ వ్యాపార సంస్థ లో సభ్యత్వం గల దేశం మనది. అందువల్ల కొన్ని నిబంధనలకు కట్టుబడి ఉండటం వలన మనదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల కార్యకలాపాలు ప్రభావితం అవుతున్నాయి. దేశంలో లభ్యమయ్యే ఖనిజ సంపదను వినియోగించుకోకుండా దిగుమతులపై ఆధారపడి విదేశీ మారక ద్రవ్యాన్ని పెద్దమొత్తంలో వ్యయంకరించడమూ ప్రస్తుత సంక్షోభానికి కారణం అవుతోంది. దేశంలో 60 శాతం జనాభాకు ఉపాధి అందిస్తున్న వ్యవసాయ రంగానికి తగినంత ప్రాధాన్యత లభించకపోవడం ఈ సంక్షోభానికి ముఖ్యకారణం. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుముఖం పడతాయి. తగ్గితే ధరలు తగ్గుతాయి. అందుకే వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు ప్రభుత్వం కేటాయింపులు పెంచాలి. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి. వాణిజ్య పంటల ధరలు ఎక్కువగా ఉంటుండటంతో రైతులు ఆ పంటలపై మొగ్గుచూపుతున్నారు. కనుక కనీస మద్దతు ధర అన్ని పంటలకు నిర్ణయించాలని ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకోవాలి.రైతుకు గిట్టుబాటు ధర లభింపజేయడం అత్యంత ముఖ్యమైనది. ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయం కన్నా 50 శాతం అధికంగా ఉండాలన్న స్వామినాథన్ సిఫార్సును నిత్యం గౌరవించాలి. దేశాన్ని సంక్షోభం నుంచి కాపాడటానికి ఒకవైపు ప్రజలు, ప్రభుత్వం బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. స్వదేశీ వస్తువుల వినియోగం ఎంత అవసరమో? ఎందుకు అవసరమో అనే విషయాన్ని గాంధీ సూచించిన మార్గాలను అనుసరించాలి..!!

# రామాయపట్నంలో ఓడరేవు ఏర్పాటు చేయండి

## – రాజ్యసభలో బీజేపీ ఎంపీ జీవీఎల్

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆర్ఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్‌లో రామాయపట్నం పోర్టు నిర్మాణంపై కేంద్రం చొరవ తీసుకోవాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు గురువారం రాజ్యసభలో కోరారు. దుగ్గరాజపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయంగా రామాయపట్నం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు నిర్మాణం వలన వెనుకబడిన ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అభివృద్ధి చెందుతాయని, సుమారు రూ. 50వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని జీవీఎల్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

రామాయపట్నంలో ఓడరేవు నిర్మించడానికి ఏపీ రీఆర్గనైజేషన్ చట్టం ద్వారా అవకాశం ఉందని, దుగ్గరాజపట్నంలో ఈ ఓడరేవు నిర్మాణాన్ని చేపట్టాలని చట్టంలో ఉన్నప్పటికీ అది సాధ్యం కాదని కేంద్రం మూడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పింది. కాబట్టి ఈ ఓడరేవు నిర్మాణాన్ని దుగ్గరాజపట్నంకు బదులుగా రామాయపట్నంలో చేపట్టాలని జీవీఎల్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి చొరవ తీసుకుని రామాయపట్నంలో పెద్ద ఓడరేవు నిర్మాణానికి ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.

# హెల్మెట్ లేదని జరిమానా వేస్తారా?

## కరెంట్ కట్‌తో షాకిచ్చిన విద్యుత్ ఉద్యోగి

లక్నో,ఆగస్ట్ 1(ఆర్ఎన్ఎ): విద్యుత్ అధికారి హెల్మెట్ పెట్టుకోలేదని రూ.500 జరిమానా విధిస్తే, బిల్లు చెల్లించలేదని పోలీస్ స్టేషన్‌కు కరెంట్ కట్ చేసి కసి తీర్చుకున్నాడో విద్యుత్ ఉద్యోగి. ఈ సంఘటన ఆగ్రాలోని లీనాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ అనే విద్యుత్ అధికారి హెల్మెట్ పెట్టుకోలేదని లీనాపూర్ ఎస్ఐ రమేశ్ చంద్ర రూ.500 చలానా రాశాడు. హెల్మెట్, ట్రాఫిక్ రూల్స్ గురించి శ్రీనివాస్‌కు చెప్పి అక్కడి నుంచి పంపించాడు. దీంతో శ్రీనివాస్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లగానే పోలీస్ స్టేషన్‌కు వెళ్లే కరెంట్ తీగను కట్ చేశాడు. పోలీసులు సబ్ స్టేషన్‌కు ఫోన్ చేయగా పోలీస్ స్టేషన్‌పై రూ. 6.6 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉందని అందుకే కట్ చేశామని వివరణ ఇచ్చాడు. 2016 నుంచి ఆ పోలీస్ స్టేషన్‌కు బిల్లులు చెల్లించడంలేదని సబ్ డివిజనల్ ఆఫీసర్ రణ్ వీర్ సింగ్ తెలిపారు. ఈ చర్యతో పోలీసులు షాక్ తిన్నారు. అనవసరంగా విద్యుత్ ఉద్యోగితో పెట్టుకున్నామని వాపోయారు.

# హెచ్ఐవి బాధితురాలిపై అత్యాచారం

## పోలీసులుకు ఫిర్యాదుచేసిన యువతి తండ్రి

ఔరంగాబాద్,ఆగస్ట్ 1(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో దారుణం జరిగింది. హెచ్ఐవీ బాధితురాలిని నలుగురు వ్యక్తులు అత్యాచారం చేశారు. ఈ ఘటన ఔరంగాబాద్ నగరంలో చోటుచేసుకుంది. అయితేఅత్యాచారం చేసిన వారికి ఈ విసయంతెలియకపోవడంతో పాటు..ఆగంతకులను గుర్తించకపోవడంతో వారిపై కేసు నమోదు కాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె తన సోదరుడితో కలిసి నగరంలో నివసిస్తోంది. స్థానికంగా నివసించే స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లిన సందర్భంగా ఆమె అత్యాచారానికి గురైంది. జరిగిన ఘటనతో బెంబేలెత్తిన ఆమె సోదరుడు.. ఆమెను తండ్రి వద్దకు పంపించేశాడు. స్థానిక బేగంపురా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆమె తండ్రి ఫిర్యాదు చేయగా.. కేసును చునాభట్టి పీఎస్‌కు బదిలీ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో ఆమెకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించగా... అత్యాచారానికి గురైనట్టు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడ్డ కారణంగా తాను ఈ కేసులో నిందితులను గుర్తించలేకపోయానని పోలీసులకు బాధితురాలు తెలిపింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## విద్యుద్ఘాతంతో ఇద్దరు కార్మికులకు గాయాలు

ఖమ్మం,ఆగస్ట్ 1(ఆర్ఎన్ఎ): విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని కొదుమూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పనులు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ నారపోగు నర్సింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి ప్రదీప్ స్వల్పగాయలతో బయట పడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్ తెలిపారు.

# ఆపరేషన్ ముస్కాన్‌లో 127 బాలలకు విముక్తి

## –కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, ఆగష్టు 2:అనాధ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణ నియంత్రణ కోసం కొనసాగిన్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు 127మంది బాలలకు విముక్తికల్పించారు. ఇందులో భాగంగా ఈనెల 01నుండి 31వరకు స్పెషల్‌డ్రైవ్‌ను నిర్వహించారు.

బాలలకు విముక్తి కల్పించేందుకు కమీషనరేట్ వ్యాప్తంగా మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రెండు బృందాలకు ఒక్కో ఎస్ఐ,నలుగురు కానిస్టేబుళ్ళను నియమించగా, యంటివో జానీమియా ఆధ్వర్యంలో ఐదుగురు కానిస్టేబుళ్ళు కలిగిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందం పోలీసులు ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా వివిధ వ్యాపార,వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న బాలలను చేరదీసి చైల్ట్ వెల్ఫేర్ కమిటి(సిడబ్లూసి) అధికారులకు అప్పగించారు.

గుర్తించిన బాలల్లో బిక్షాటన, వీధిబాలలు, తప్పిపోయిన, బాలకార్మికులు, మధ్యలో బడిమానేసినవారున్నారు. రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ షేక్ జానీమియా ఆధ్వర్యంలో చురుకుగా పనిచేసిన కానిస్టేబుళ్ళు యం శ్రీనివాస్, పి జయపాల్, యం అనీల్‌కుమార్, జి సరేష్ కుమార్, కె సాయిదీప్‌లను పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందించారు.

పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించాలి

బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల విభాగాలకు చెందిన పోలీసులు సమర్ధవంతమైన సేవలందిస్తూ పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. పోలీసులు సమర్ధవంతమైన సేవలందించేందుకు మానసికంగా, శారీరకంగా సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

గురువారం నాడు కమిషనరేట్ కేంద్రంలో బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ బ్లూకోల్ట్, పెట్రోలింగ్ వాహనాల గస్తీతో నేరాల నియంత్రణలోకి వచ్చాయని, సమర్ధవంతమైన సేవలందిస్తున్న బ్లూకోల్ట్ బృందాలకు ప్రోత్సాహకాలను అందజేస్తామని చెప్పారు. క్రమశిక్షణలను ఉల్లఘించే వారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూ ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గస్తీని నిర్వహించాలని తెలిపారు. విధినిర్వాహణ ముగిసిన అనంతరం విధుల్లో చేరే ఇతర బృందాలకు పరిస్థితులను వివరించాలని సూచించారు. గస్తీ నిర్వహిస్తున్న ప్రాంతాల్లో హిస్టరీషీటర్లకు సంబంధించిన ప్రతికదలికలను గమనించడంతోపాటు వారి గురించి తెలుసుకుని ఉండాలని తెలిపారు. ప్రతిరోజు విధినిర్వాహణకు సంబంధించిన నివేదికను సంబంధిత అధికారులకు అందజేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎసిపిలు శివభాస్కర్, రాగ్యానాయక్, త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ముహూర్తం బాగాలేదా?

కరీంనగర్, ఆగష్టు 2:పోలవరం ప్రాజెక్టు పనుల్లో అక్రమాలపై విపక్షంలో ఉండగానే వైకాపా విమర్శలు చేస్తూ వచ్చింది. అలాగే అనేక అవకతవకలు జరిగాయని సర్వత్రా ఆరోపణలు వచ్చాయి. కేంద్రం కూడా ఈ విషయంలో అనేకానేక అనుమానాలు వ్యక్తం చేసింది. విపక్షంలో ఉండగా ప్రస్తు సిఎం వైఎస్ జగన్ ఏనాడూ పోలవరాన్ని సందర్శించక పోవడానికి కూడా ఇదే కారణంగా చెబుతారు. జాతీయ ప్రాజెక్టుగా పోలవరాన్ని కేంద్రం నిర్మించాల్సి ఉన్నా, కావాలనే చంద్రబాబు ముందుకు వచ్చి రాష్ట్రప్రభుత్వమే నిర్మిస్తుందని పనలుఉల చేపట్టడం అనేక అనుమాలనాలకు బలం చేకూరింది. అలాగే ఐదేళ్లలో పనులు చేపట్టిన సందర్భంలో కాంట్రాక్టర్లు మారారు. మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు నేతృత్వంలోని కంపెనీ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసింది. గతంలో కూడా పోలవరం కోసం అనేకానేక కంపెనీలు ముందుకు వచ్చినా ఎందుకనో ఏ ఒక్కరూ నిజాయితీగా పనులు చేపట్టలేదు. ఇది ఏ ముహూర్తాన మొదలు పెట్టారో కానీ సక్రమంగా ముందుకు సాగుతున్న దాఖలాలు కానరాలేదు. మొత్తంగా ఇప్పుడు నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలను ప్రారంభించింది. జలాశయం హెడ్‌వర్క్స్ పనుల నుంచి తప్పుకోవాలని నవయుగ సంస్థకు, గేట్ల తయారీ పనుల నుంచి వైదొలగాలని బీకెమ్ సంస్థకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఒప్పందాన్ని ముందుగానే రద్దు చేసుకోవాలని సూచిస్తూ నవయుగ, బీకెమ్‌లకు పోలవరం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌బాబు జూలై 29న నోటీసులు జారీ చేశారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే ఈ పనులకు రివర్స్ టెండరింగ్ నిర్వహించేందుకు వీలుగా నోటిఫికేషన్ జారీ చేస్తామని జలవనరుల శాఖ వర్గాలు తెలిపాయి. మొత్తంగా అటు కేంద్రం,ఇటు జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపోలవరం అవకతకలపై నిగ్గుతేల్చాలని నిర్ణయించాయి. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో వేలకోట్ల అవకతవకలు జరిగాయన్న ప్రాథమిక నిర్ధారణతో ప్రభుత్వం కంట్రాక్టర్లను తప్పించింది. అలాగే అవకతవకలను నిగ్గు తేల్చేందుకు ఇప్పటికే విచారణ చేపట్టింది. సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్ కూడా ఉంది.

విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వమే వంద శాతం ఖర్చు భరించి పోలవరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ కమీషన్ల దాహంతో మాజీ సీఎం చంద్రబాబు పోలవరం బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగించాలని కేంద్రాన్ని కోరారని జగన్ నమ్ముతున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పోలవరం బాధ్యతలను 2016 సెప్టెంబరు 7న కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. పోలవరం హెడ్ వర్క్స్ కాంట్రాక్టు ఒప్పందం గడువు ముగియక ముందే నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయాన్ని రూ.1331.91 కోట్లు పెంచేస్తూ 2016 సెప్టెంబరు 8న ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్‌కి లబ్ధి చేకూర్చేలా చేశారని ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ట్రాయ్‌ని అడ్డం పెట్టుకుని పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించేసి కమీషన్లు వసూలు చేసుకున్నట్లు నమ్ముతున్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ట్రాన్స్‌ట్రాయ్ 2017 నాటికి దివాలా తీసింది. నిబంధనల ప్రకారం దివాలా తీసిన ట్రాన్స్‌ట్రాయ్‌తో కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసుకుని టెండర్లు పిలిచి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాల్సి ఉండగా అలాంటిదేమీ జరగలేదన్న వాదనా ఉంది. పోలవరం జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనులను నవయుగకే కట్టబెట్టాలని ముందుగానే నిర్ణయించిన చంద్రబాబు 2017 జనవరి 7న ఏపీ జెన్‌కోతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయించారు. నిజానికి పోలవరం హెడ్‌వర్క్స్‌లో జలవిద్యుదుత్పత్తి కేంద్రం పునాది పనులు అంతర్భాగమే. హెడ్‌వర్క్స్ ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ దివాలా తీసిన నేపథ్యంలో ఆ పనులనూ నవయుగకే అప్పగించి అటు జలవిద్యుదుత్పత్తి కేంద్రం, ఇటు హెడ్‌వర్క్స్‌లో కమీషన్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్ వేశారని వైకాపా నమ్ముతోంది. మొత్తంగా అనుమానాలు రావడం, ఆరోపణలు తోడవ్వడంతో టీడీపీ హయాంలో ఇంజనీరింగ్ పనుల్లో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిపుణుల కమిటీని నియమించారు. పోలవరం పనులపై విచారించిన నిపుణుల కమిటీ ఆర్థికంగా దివాలా తీసిన ట్రాన్స్‌ట్రాయ్‌తో నాటి ప్రభుత్వం ఒప్పందం రద్దు చేసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఈపీసీ ఒప్పందం గడువు ముగియకుండానే అంచనా వ్యయాన్ని పెంచేయడం, నవయుగ, బీకెమ్ సంస్థలకు ఎల్ఎస్ ఓపెన్ పద్ధతిలో నామినేషన్ విధానంలో పనులు అప్పగించడం వంటి వాటిని నిపుణుల కమిటీ ఆక్షేపించింది. పోలవరం హెడ్ వర్క్స్, జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనుల్లో రూ. 2,346.85 కోట్ల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారిస్తూ నిపుణుల కమిటీ గత నెల 24న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా కుదుర్చుకున్న కాంట్రాక్టు ఒప్పందాలను రద్దుచేసి హెడ్ వర్క్స్, జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనులకు ఒకే ప్యాకేజీ కింద రివర్స్ టెండరింగ్ నిర్వహించాలని కమిటీ సిఫార్సు చేసింది. ఈ పనులను ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించడం వల్ల పనుల్లో సమన్వయం కుదురుతుందని, రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి సాధ్యపడుతుందని పేర్కొంది. దీంతో సిఎం వైఎస్ జగన్ ఇక పోలవరంపై తోణ నిర్ణయం తీసుకున్నారు. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నవయుగతో చేసుకున్న మూడు ఒప్పందాలు, బీకెమ్ సంస్థతో చేసుకున్న మరో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని సూచిస్తూ ఆ రెండు సంస్థలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. మొత్తంగా ఇప్పుడు కొత్తగా టెండర్లు పిలవడంతో పాటు గతంలో జరిగిన అవినీతిపై నిగ్గుతేల్చాల్సి ఉంది. ఇలాంటివి చేయడం ద్వారా అవినీతిని బయట పెట్టగలిగితే ప్రజలు హర్షిస్తారు. రాజకీయ అవినీతిని ఎండగట్టేందుకు చిత్తశుద్ధితో ముందుకు సాగితే స్వాగతిస్తారు.

# కుల్‌భూషణ్‌ను కలిసేందుకు..

# భారత అధికారులకు అనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆర్ఎన్ఎ) : అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)ఆదేశాల మేరకు శుక్రవారం పాకిస్థాన్‌లోని భారత దౌత్యాధికారులు నౌకాదళ విశ్రాంత అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను కలిసేందుకు ఆ దేశం అనుమతించింది. దీనికి సంబంధించి 10 రోజుల క్రితం ఐసీజే ఇచ్చిన ఆదేశాలను పాక్ పాటించకతప్పలేదు. అయితే దీనిపై భారత ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. కుల్‌భూషణ్ జాదవ్(49) తమ భూభాగంలోకి అక్రమంగా చొరబడ్డారంటూ పాకిస్థాన్ సైనికులు 2016లో ఆయనను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన అక్కడి సైనిక న్యాయస్థానం 2017 ఏప్రిల్‌లో ఆయనకు మరణశిక్ష విధించింది. జాదవ్ గూఢచౌర్యానికి, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ పేర్కొంది. అయితే ఈ వాదనలను భారత్ ఖండించింది. భూషణ్ అసలు పాకిస్థాన్ వెళ్లనే లేదని, ఉద్యోగ విరమణ తర్వాత ఇరాన్‌లో వ్యాపారం చేసుకుంటుండగా అపహరణకు గురయ్యారని పేర్కొంది. దీనిపై భారత్ ఐసీజేను ఆశ్రయించింది. కొద్ది రోజుల క్రితం జరిగిన విచారణలో న్యాయస్థానం పాక్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అతనికి న్యాయ సహాయం అందకుండా పాక్ తీవ్ర తప్పిదం చేసిందని మండిపడింది.

## వేములవాడ వార్తలు

# ప్రణాళిక ప్రకారం వేములవాడ అభివృద్ధి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి): ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడను ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామని కలెక్టర్ డి.కృష్ణభాస్కర్ అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ వైస్ ఛైర్మన్ పురుషోత్తంరెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. రాజన్న గుడితోపాటు, వేములవాడ పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగిరం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆలయ మార్గం రోడ్డు విస్తరణపై చర్చించారు. వేదపాఠశాల, బస్టాండ్, బద్దిపోచమ్మ ఆలయం, రాజన్న ఆలయ అభివృద్ధి కోసం చేయాల్సిన భూసేకరణపై మాట్లాడారు. ఎంతో చరిత్ర గల వేములవాడ పట్టణం, రాజన్నఆలయానికి పూర్వవైభవం కల్పించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వందల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో జేసీ యాస్మిన్‌బాషా, డీఆర్వో ఖీమ్యానాయక్, వీటీడీఏ కార్యదర్శి భుజంగరావు, ఈఈ అమరేందర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రంగా వేములవాడ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి) ప్రసిద్ధ ఆధ్యాత్మికక్షేత్రంగా వేములవాడను తీర్చిదిద్దుతామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. వీటీఏడీఏ ఉపాధ్యక్షుడు ముద్దసాని పురుషోత్తమరెడ్డితో కలిసి పట్టణంలో కొనసాగుతున్న వంతెన నిర్మాణాలు, రోడ్ల విస్తరణ, గుడిచెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజన్న గుడిచెరువులో భక్తులు గోదారి జలాలతో స్నానాలు చేసేందుకు పుష్కర ఘాట్లు నిర్మిస్తామన్నారు. పట్టణంలో ప్రముఖ ఆలయాలతో పాటు, సంస్కృత, నృత్య, వేద పాఠశాలలు ఉన్నాయని, నిత్యం ఆధ్యాత్మిక శోభతో భక్తులను ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. వేద పాఠశాల, నృత్య కళాశాల, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ, సెంట్రల్ బస్టాండ్ నిర్మాణాల కోసం భూసేకరణ చివరి దశకు వచ్చినట్లు చెప్పారు. నిర్వాసితులను పూర్తిస్థాయిలో సంతృప్తి పరిచేవిధంగా న్యాయం చేస్తామన్నారు. గుడిచెరువు సుందరీకరణలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మిస్తామని పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా మధ్యమానేరు నుంచి గుడిచెరువుకు నిత్యం నీళ్లందిస్తామన్నారు. నిర్మిస్తున్న ట్యాంక్‌బండ్‌పైన మూడు భాగాలు విభజించి నెక్లెస్‌రోడ్డుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పట్టణంలో రాజన్న ఆలయం నుంచి బస్టాండ్ వరకు ప్రధానరోడ్డు విస్తరణ కోసం అంచనాలు రూపొందించినట్లు చెప్పారు. వీటీఏడీఏ ఉపాధ్యక్షుడు ఎం.పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ వీటీఏడీఏ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టబోయే పనుల కోసం డీపీఆర్‌లు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీటీఏడీఏ కార్యదర్శి భుజంగరావు, నీటిపారుదలశాఖ డీఈ పవన్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ సురేశ్‌బాబు, తెరాస నాయకుడు యాచమనేని శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# గోవుల అక్రమరవాణా నియంత్రణకు చెక్‌పోస్టుల ఏర్పాటు

కరీంనగర్, ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి)గోవుల అక్రమరవాణా నియంత్రణకు కరీంనగర్ కమీషనరేట్ ప్రవేశద్వారాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు గురువారం నాడు ప్రారంభమయ్యాయి.

ఈ చెక్‌పోస్టుల వద్ద రేయింబవళ్ళు తనిఖీలను నిర్వహిస్తారు. చెక్‌పోస్టులతోపాటు పెట్రోలింగ్ నిర్వాహణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. హోంగార్డు స్థాయి నుండి ఎస్ఐ స్థాయి వరకు 100 మంది పోలీసులను ఈ చెక్‌పోస్టుల్లో నియమించారు.

జిల్లాలోని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్దుంపూర్, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వద్దేపల్లి(కమాన్‌పూర్), చొప్పదండి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్నకొండ, గంగాధర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కాషినగర్, మానకొండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గట్టుదుద్దెనపల్లి, హుజురాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్కాల క్రాస్‌రోడ్డు వద్ద ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

షిఫ్టు పద్ధతిలో చెక్‌పోస్టుల వద్ద విధినిర్వాహణ కొనసాగుతుంది. గోవుల అక్రమరవాణాకు ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి కోరారు. బృందాలుగా ఏర్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేయకూడదని తెలిపారు. గోవుల అక్రమరవాణా,వధలకు పాల్పడితే తీసుకునే చర్యలపై గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహించడంతోపాటు, సంతల్లో క్రయ,విక్రయాలు జరుగుకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీస్‌శాఖ ఏమతానికి,వర్గానికి మద్దతుగా నిలువదని, శాంతిభద్రతల పరిరక్షణధ్యేయంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# ఎర్రమంజిల్ కూల్చివేతపై పిటిషనర్లకు హైకోర్టు అక్షింతలు

**పిటిషనర్లు నిజాంలాగా ఫీల్ కావద్దని చురకలు**

**అప్పులున్నాయని అభివృద్ధిని అడ్డుకోమంటారా అని నిలదీత**

**కేబినేట్ నిర్ణయంలో ఎలా జోక్యంచేసుకుంటామని ప్రశ్న**

**అసెంబ్లీ నిర్మాణంపై విచారణ..**

హైదరాబాద్,ఆగస్ట్2 (ఆంఎన్ఎ): ఎర్రమంజిల్ భవనం కూల్చివేత అంశంపై గురువారం హైకోర్టులో వాదనలు జరిగాయి. తెలంగాణకు ఇప్పటికే వేల కోట్ల అప్పులున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది అన్నారు. అయితే అప్పులున్నాయని అభివృద్ధి పనులు ఆపమని చెప్పాలా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. కేబినెట్ నిర్ణయాలపై కోర్టులు ఎలా జోక్యం చేసుకుంటాయని కూడా ప్రశ్నించింది. పిటిషనర్లే నిజాం రాజులాగా భావించుకొని వాదించొద్దని న్యాయస్థానం సూచిస్తూ.. తదుపరి విచారణను శుక్రవారం నాటికి వాయిదా వేసింది. ఎర్రమంజిల్ భవనం కూల్చివేత అంశంపై హైకోర్టులో గురువారం కూడా సుదీర్ఘ వాదనలు జరిగాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు విన్పించారు. ఎర్రమంజిల్‌లోని భవనాలన్నీ వారసత్వ కట్టడాల పరిధిలోకి వస్తాయని.. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందంటూ వాదించారు. వీటికి సంబంధించి గతంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. రాష్ట్రం ఇప్పటికే రూ.వేల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. అవసరం లేకపోయినా.. రూ.కోట్ల వ్యయంతో అసెంబ్లీ నిర్మాణం కట్టాల్సిన పనిలేదని అభిప్రాయపడ్డారు. దీనిపై హైకోర్టు ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. పిటిషనర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. దేశానికి కూడా రూ.లక్షల కోట్ల అప్పు ఉందని.. అలాగని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆపేయడం లేదు కదా అని వ్యాఖ్యానించింది. అప్పులు ఉన్నంత మాత్రాన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవద్దని తామెలా ఆదేశించగలమని ఉన్నత న్యాయస్థానం పిటిషనర్లను ప్రశ్నించింది. ఈ అంశం అభివృద్ధికి సంబంధించిన అంశం కాదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అసలు న్యాయస్థానం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు, మంత్రిమండలి నిర్ణయాల్లో ఏవిధంగా జోక్యం చేసుకోగలదో చట్టంలోగానీ, రాజ్యాంగంలో గానీ ఉన్న అంశాలేమిటో తమకు వివరించాలని న్యాయవాదులకు సూచించింది. ఈ అంశంపై కేబినెట్ నిర్ణయంతో పాటు దానికి సంబంధించిన ప్రక్రియలో ఎక్కడైనా చట్టపరమైన ఉల్లంఘనలేమైనా ఉంటే వాటిని కూడా వివరించాలని సూచించింది. పిటిషనర్లు భవనాలకు తావే యజమానులైనట్టు, నిజాంలైనట్టు వాదించకూడదని.. చట్టం పరిధిలోనే వాదించాలని వ్యాఖ్యానించింది. బహిరంగ ప్రదేశాలు, చట్టసభల్లో ప్రసంగాలు చేసినట్టు కాకుండా న్యాయస్థానంలో హుందాగా ప్రవర్తించాలని అక్షింతలు వేసింది.అనంతరం ఈ పిటిషన్లపై విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

# బంగారు తెలంగాణ పేరుతో అప్పుల కుప్పచేశారు: పొన్నం

సిద్దిపేట,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి.. కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఐదు సంవత్సరాల పాలనలో ఒక లక్ష 85 వేల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కలగానే మిగిలాయని వ్యాఖ్యానించారు. మూడెకరాల పంపిణీ ఊసే లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుక లేకుండా ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి

గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో టిఆర్ఎస్‌ను ఓడిస్తే తప్ప ప్రజల సమస్యలపై దృష్టి పెట్టరని అన్నారు.

# ఆశాజనకంగా వర్షపాతం

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

న్యూఢిల్లీ,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ): మలివిడత నైరుతి రుతుపవనాల తీరు ఆశాజనకంగానే ఉంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజాగా కురుస్తున్న వర్షాలతో నీటి సమస్యకు ఇబ్బందులు రావన్నారు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలలో 8శాతం అటుఇటుగా వందశాతం వర్షపాతం నమోదవుతుందని మెట్ అభిప్రాయపడింది. ఈ నెలలో 9శాతం అటుఇటుగా 99 శాతం వర్షాలు పడతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. గత రెండు నెలలుగా రుతుపవనాల గమనం మందగించినా, మంచి వర్షాలే పడ్డాయని మెట్రాలజీ అభిప్రాయ పడింది. ఇదిలావుంటే పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. బంగాళాఖాతంలో 5.8 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఈ నెల 4వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణలో ఇవాళ చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రానున్న రెండుమూడు రోజుల్లో కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీలో కరణం బలరాం, ఆళ్ల నాని, కోలగట్ల వీరభద్ర స్వామి.. తెలంగాణలో యాదవ రెడ్డి స్థానాల్లో కొత్త వారిని ఎన్నుకునేందుకు వీలుగా షెడ్యూల్ జారీ చేసింది. గతంలో తెదేపా నుంచి కరణం బలరాం, వైకాపా నుంచి ఆళ్ల నాని, కోలగట్ల వీరభద్ర స్వామి ఎమ్మెల్సీలుగా ఉండే వారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో వీరంతా ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. అలాగే నారాయణ,సోమిరెడ్డిలు కూడా రాజీనామాలుచేసి పోటీ చేసినా ఓడి పోయారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్సీగా ఉన్న యాదవరెడ్డిపై అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈనెల 7న దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

# వైద్యుల సమ్మెతో పేదరోగులకు ఇక్కట్లు

**నేషనల్ మెడికల్ బిల్లుపై అనవసర రాద్ధాంతం**

**బాధ్యతారాహిత్యంగా వైద్యుల తీరు**

న్యూఢిల్లీ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): వైద్యుల దేశవ్యాప్త సమ్మెతో రోగుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. కేంద్రం తీసుకుని వస్తున్న బిల్లుకు వ్యతిరేకంగా చేపట్టిన సమ్మె వల్ల సామాన్యులు నలిగిపోతున్నారు.

అయితే వివాదాస్పద నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) బిల్లుకు గురువారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. వైద్య విద్యకు సంబంధించి అతిపెద్ద సంస్కరణగా ప్రభుత్వం అభివర్ణిస్తున్న ఈ బిల్లులో.. అవినీతికి ఆలవాలంగా మారిందని ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనను పొందుపర్చారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్నారు. దీంతో వైద్యులు రోడ్డెక్కడంతో రోగులు వైద్యం అందక గిలగిల కొట్టుకుంటున్నారు. తమ వల్ల ఇలాంటి దురవస్థ ప్రజలకు రాకూడదన్న ఇంగితాన్ని వైద్యులు ప్రదర్శించలేకపోయారు. రోడ్డెక్కి నినాదాలు చేస్తూ ఆస్పత్రులను గాలికి వదిలేశారు. నిజంగా ఇది బాధ్యతారాహిత్యం కాక మరోటి కాదు. లోక్‌సభలో ఇప్పటికే ఈ బిల్లు ఆమోదం పొందినప్పటికీ.. తాజాగా రెండు సవరణలకు లోక్‌సభ ఆమోదం తెలపాల్సి ఉన్న నేపథ్యంలో మరోసారి ఈ బిల్లు లోక్‌సభకు వెళ్లనుంది. బిల్లుపై జరిగిన చర్చకు ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ సమాధానమిస్తూ నకిలీ వైద్యులకు అడ్డుకట్ట వేసేలా ఈ బిల్లు ఉందన్నారు. తప్పుడు వైద్య విధానాలకు పాల్పడేవారికి సంవత్సరం జైలు శిక్షతో పాటు, రూ. 5 లక్షల జరిమానా విధించే ప్రతిపాదన బిల్లులో ఉందన్నారు. ఇప్పటివరకు అలాంటి వారికి ఎంసీఐ నామమాత్రపు జరిమానా మాత్రమే విధించేదని తెలిపారు. ఈ బిల్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిందని, అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆ వ్యవస్థను అమలు చేస్తున్నాయని, భారత్ కూడా ఆ దిశగా వెళ్తోందని చెప్పారు. ఎన్ఎంసీలోని 25 మంది సభ్యుల్లో 21 మంది వైద్యులేనని, వారు సీహెచ్‌పీల అర్హతలను నిర్ణయిస్తారని హర్షవర్ధన్ వివరించారు. దీంతో వైద్యులు దీనిని వ్యతిరేకించి వీధిన పడ్డారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగడం ప్రస్తుతానికి అయితే సంకటంగా మారింది. వైద్యసేవల విషయంలో దాదాపు అన్ని రాష్ట్రల్లోని నగరాలకూ, పట్టణాలకూ... పట్టణాలకూ, గ్రామాలకూ మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. మైదాన ప్రాంతాలకూ, ఆదివాసీ ప్రాంతాల మధ్యా అనేక తేడాలు ఉన్నాయి. మారుమూల పల్లెలకు నేటికీ వైద్యం అందని ద్రాక్షగా మారింది. మరో దశాబ్ద కాలంలో...అంటే 2030నాటికి ప్రపంచంలోని ప్రతి దేశమూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. నీతిఆయోగ్ 2015 నుంచి ఏటా ఈ ఆరోగ్య సూచీని విడుదల చేస్తోంది. విషాదమేమంటే వీటిని గమనించుకుని సరిచేసుకోవాలని, ఇకపై మరింత మెరుగైన పనితీరును ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్న దాఖలాలు కానరావడం లేదు. అత్యధిక రాష్ట్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కనీస పారిశుద్ధ్యం కొరవడి వైరస్‌లతో, బాక్టీరియాతో నిండి ఉంటున్నాయి. ఎక్కడా కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండటం లేదు. మందులు లేక, వైద్యులు లేక ఆసుపత్రులన్నీ అల్లాడు తున్నాయి. అనేకమంది పసిపిల్లల ప్రాణాలు తీసిన ముజఫర్‌పూర్ ఆసుపత్రి దుస్థితి ఇందుకు తాజా ఉదాహరణ. వైద్య సదుపాయాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ, లాన్‌సెట్ కూడా అడపాదడపా హెచ్చరిస్తూనే ఉన్నాయి. కానీ ఎక్కడా కదలిక ఉండటం లేదు. ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్య ప్రదేశ్, రాజస్తాన్ తదితర ఉత్తరాది రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో మెజారిటీ జనం ఆరోగ్యానికి పెట్టే ఖర్చులు తడిసి మోపెడై అప్పుల బారినపడుతున్నారని ఒక సర్వే వెల్లడించింది. కొన్ని కుటుంబాల్లో తలసరి వినిమయం కన్నా ఆరోగ్య వ్యయమే అధికంగా ఉంటున్నదని తేల్చిచెప్పింది. నవజాత శిశు మరణాలు, శిశు మరణాలు, సంతాన సాఫల్యత రేటు, తక్కువ బరువుతో పుట్టే శిశువుల సంఖ్య, వ్యాధి నిరోధకత, క్షయవ్యాధి, మౌలిక సదుపాయాలు, హెచ్ఐవీ వంటివి అరికట్టడంలో సాధిస్తున్న పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనలో సాధిస్తున్న ప్రగతి వగైరా అంశాలు అందులో ఉన్నాయి. ఆరోగ్యశ్రీ, 108 వంటి ప్రాణప్రదమైన సేవలు నామమాత్రంగా మారాయి. నీతిఆయోగ్ ప్రాతిపదికల్లో ఇంకా అంటురోగాలు, మానసిక అనారోగ్యం, భయంకర వ్యాధులు వగైరాలను చేరిస్తే వాస్తవ చిత్రం మరింత స్పష్టంగా వెల్లడవుతుంది. ఇలాంటి దశలో వైద్యరంగాన్ని పటిష్ట పరుస్తున్న దశలో వైద్యుల సమ్మెలు ఆందోళన కలిగిస్తున్నాయి. జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) బిల్లును రాజ్యసభలోనూ ఆమోదించడంతో జూనియర్ వైద్యులు ఆందోళనను ఉద్ధృతం చేశారు. బిల్లులోని అభ్యంతరకర అంశాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. గత మూడు రోజులుగా ఓపీ, ముందస్తు ఎంపిక చేసుకున్న శస్త్రచికిత్సలను బహిష్కరిస్తూ వచ్చిన జూడాలు అత్యవసర సేవల్లోనూ పాల్గొనేది లేదని తేల్చిచెప్పారు.అత్యవసర సేవలను బహిష్కరించారు.

ప్రభుత్వ వైద్య విద్యార్థులకు నష్టం కలిగించే విధంగా ఎన్ఎంసీ బిల్లులో అంశాలను పొందుపర్చారని ఆరోపిస్తూ జూనియర్ వైద్యులు సమ్మెను కొనసాగించారు. తమ డిమాండ్లను సాధించే వరకు దీక్షను కొనసాగిస్తామని, అఖిల భారత స్థాయిలో ఐఎంఏ, జూడాల నేతలతో సంప్రదించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఓపీలో వైద్యుని సంప్రదింపుల్లో జూడాలే కీలక భూమిక పోషిస్తుండడంతో వారి సమ్మె ప్రభావం ఓపీపై తీవ్రంగా పడింది. ప్రభుత్వ వైద్యులు, సీనియర్ రెసిడెంట్లు, నర్సింగ్ పీజీలు ఉన్నప్పటికీ రోగులు పెద్దసంఖ్యలో రావడంతో వారిని పరీక్షించేందుకు ఐదారుగంటల సమయం పట్టింది. విధులను బహిష్కరించడంతో శస్త్రచికిత్స విభాగాల్లో పెద్దఎత్తున ఆపరేషన్లు నిలిచిపోయాయి.

# త్వరలోనే సిడబ్ల్యూసి భేటీ

**కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికను తేల్చనున్ననేతలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి ఎన్నిక విషయంలో ఇంకా ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. అయితేత్వరలోనే అధ్యక్షుడిని ఎన్నుకోడానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటివరకైతే మరికొన్ని రోజుల్లో సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతుందని ప్రకటిస్తూనే ఉన్నా, దానికి ముహూర్తం మాత్రం ఖరారు కాలేదు. తాజా సమాచారం ప్రకారం పార్లమెంట్ సమావేశాలు ముగిసిన వెంటనే సీడబ్ల్యూసీ సమావేశం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇంకా తేదీ మాత్రం ఖరారు కాలేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సూర్జేవాలా వెల్లడించారు. రాహుల్ గాంధీ కూడా సీడబ్ల్యూసీ సభ్యుడే అని, ఆయన కూడా సమావేశంలో పాల్గొంటారని ఆయన అన్నారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ప్రధాన కార్యదర్శులతో కాంగ్రెస్ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడిన కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాల తర్వాత సీడబ్ల్యూసీ సమావేశం అయితే బాగుంటుందన్న ప్రతిపాదనను సమావేశం ముందు పెట్టినట్లు తెలుస్తోంది. దీనికి సమావేశంలో పాల్గొన్న వారందరూ అంగీకరించారని, అయితే తేదీ మాత్రం ఖరారు కాలేదని సూర్జేవాలా తెలిపారు.

**విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన..**

# కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి

**- కేసీఆర్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడాలేదు**

**- తీరు మార్చుకోకపోతే మహిళలే బుద్ధిచెబుతారు**

**- కాంగ్రెస్ నేత, ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి**

హైదరాబాద్, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : చార్మినార్ ఆయుర్వేద ఆస్పత్రి తరలింపును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న సమయంలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌ను వెంటనే విధుల నుంచి తప్పించాలని కాంగ్రెస్ నేత, ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి అన్నారు. ఈమేరకు గురువారం ఆమె ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. చార్మినార్ ఆయుర్వేద ఆస్పత్రిని తరలించవద్దంటూ వైద్య విద్యార్థులు నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమంలో ఓ పోలీసు అధికారి గీత దాటి వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. ఆ పోలీసుపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. తాజాగా ఈ వ్యవహారంపై విజయశాంతి ఫేస్‌బుక్ వేదికగా రియాక్ట్ అవుతూ.. తెలంగాణ సర్కార్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఆయుర్వేద వైద్య విద్యార్థుల ఆందోళన సందర్భంగా మహిళా విద్యార్థుల పట్ల హైదరాబాద్ పోలీసులు అనుచితంగా.. అసభ్యంగా వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలవంచుకునే విధంగా ఉందని విజయశాంతి అన్నారు. ఈ ఘటనను చూసిన తర్వాత మహిళల విషయంలోనూ విద్యార్థుల విషయంలోనూ టిఆర్ఎస్ అధినాయకత్వానికి టిఆర్ఎస్ పాలకులకు ఎంత చులకన భావం మరోసారి అర్థమవుతోందన్నారు. ఓ అనామక సంస్థకు టెండర్లు అప్పగించి ఇంటర్ విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న విషయాన్ని ఇంకా ఎవరూ మరిచిపోలేదని, అదేవిధంగా విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖకు చెందిన మహిళా ఉద్యోగిపై టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే సోదరుడు ఆటవికంగా దాడి చేసినా... కేసీఆర్ ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా లైట్ తీసుకుంది. ఇప్పుడు ఆయుర్వేద కళాశాలకు చెందిన మహిళా విద్యార్థులపై పోలీసులు ప్రవర్తించిన తీరు పట్ల యావత్ రాష్ట్రం అట్టుడికిపోతున్నప్పటికీ టిఆర్ఎస్ పాలకులకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదని విమర్శించారు. మహిళల భద్రత కోసం షి టీంలను ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్... మహిళ విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. ప్రతిపక్షాలు చేసే విమర్శలను... వారి వాదనను పట్టించుకోవాల్సిన అవసరం లేదని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన విధంగా ఈ విషయంలో లో వేము చేసే డిమాండ్ ని పట్టించుకోకపోతే... మహిళల నుంచి వచ్చే తిరుగుబాటు ఎలా ఉంటుందో రుచి చూడాల్సి ఉంటుందని రాములమ్మ తన ఫేస్‌బుక్‌లో రాసుకొచ్చారు.

# విభజన సమస్యలపై మరో ముందడుగు

**ఇరు రాష్ట్రాల సంబంధాల బలోపేతానికి పునాది**

**సిఎంల భేటీతో సమస్యలపై మరింత స్పష్టత**

హైదరాబాద్,ఆగస్ట్2 (ఆంఎన్ఎ): విభజన సమస్యలపై ఇద్దరు సిఎంలు వ్యవహరిస్తున్న తీరు ఇరు రాష్ట్రాల మధ్య సంబంధాల బలోపేతానికి పునాది కానున్నాయి. ఎపిలో వైకాపా అధినేత జగన్ సిఎం అయిన నాటి నుంచి కెసిఆర్ అనేక విషయాల్లో స్నేహహస్తం సాచారు. సమస్యలను ఇరువురి మధ్యనే పరిష్కరించుకునే విధంగా ముందుకు సాగుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ గురువారం ప్రగతి భవన్‌లో ఏకాంతంగా సమావేశమయ్యారు. దాదాపు మూడు గంటల పాటు ఇద్దరే మాట్లాడుకున్నారు. వారిద్దరి మధ్య అంత సుదీర్ఘంగా సాగిన చర్చలో అనేక విషయాలు ప్రస్తావనకు వచ్చినా ప్రధానంగా ఇరు రాష్ట్రాల్లోని సమస్యలే ఎజెండా అయివుంటాయి. ముఖ్యంగా ఇద్దరూ కలిసికట్టుగా వ్యవహరించకపోతే సమస్యలు అలాగే ఉండిపోతాయన్న భావన ఏర్పడిందని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఇరు రాష్ట్రాల్లో నూ సానుకూలత వ్యక్తం అవుతోంది. రాజకీయ పరిశీలకలుఉ కూడా అభినందిస్తున్నారు. ఇరుగు పొరుగు సఖ్యతగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇచ్చిపుచ్చుకునే ధోరణి వల్ల మంచి వాతావరణం ఏర్పడుతుందని అంటున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సఖ్యతను, స్నేహగీతాన్ని కొనసాగించాలని నిర్ణయించడం వల్ల సత్సంబంధాలు కొనసాగుతాయి. ప్రభుత్వాల నడుమ సహృద్భావ వాతావరణం ఉంటే రాష్ట్ర విభజన సమస్యలు కొలిక్కి రావటంతో పాటు రాజకీయంగాను ఇరు పార్టీలకు ప్రయోజన కరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. రాష్ట్ర విభజన సమస్యలు, నదీ జలాల వినియోగంపై తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఉమ్మడిగా కలిసి ముందుకు సాగడంతో సమస్యలను దూరం చేయాలన్న భావనపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.అన్ని సమస్యలను కేంద్రం జోక్యం లేకుండానే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని వారు నిర్ణయించినట్లు తెలిసింది. ఇక నదీజలాల విషయంలో గోదావరి వృధానీటిని ముందునుంచి సద్వినియోగం చేసుకోవాలన్న వాంచ బలపడింది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత వరంగల్ జిల్లాలోని రాంపూర్ వద్ద నీటి లభ్యత ఎక్కువగా ఉందని, ఇక్కడి నుంచి నీటిని తరలించుకుందామని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. కృష్ణా బేసిన్‌కు గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టుకు ప్రాథమికంగా రూ.70-80 వేల కోట్లు అవసరమవుతాయని అంచనాకు వచ్చారు.ఈ అంచనాలతో ప్రాజెక్టను ప్రారంభించి, తర్వాత అంచనా వ్యయాలను పెంచుకోవచ్చని, అప్పటి పరిస్థితులకనుగుణంగా నిర్ణయం తీసుకుందామని అనుకున్నారని సమాచారం. ఇందుకు అనుగుణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య విభజన సమస్యలన్నింటిని పరిష్కరించుకునే దిశగా ఈనెల మూడో వారంలో మరోసారి ముఖ్యమంత్రుల స్థాయి సమావేశం జరగనుంది. విభజన అంశాల పరిష్కారానికి ముందడుగు పడిందని, వీటిని సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఇద్దరు ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు తెలిసింది. గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టులు, ఇతర అంశాలపై దాదాపు గంటసేపు ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య అర్థవంతమైన చర్చ జరిగిందని సమాచారం.

# పేపర్‌లెస్‌గా పార్లమెంట్ వ్యవహారాలు

**ఖర్చులు తగ్గించే చర్యలకు స్పీకర్ నిర్ణయం**

న్యూఢిల్లీ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): లోక్‌సభ ఖర్చులను తగ్గించేందుకు స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు.లోక్ సభ ను వచ్చే సమావేశాల నుంచి పేపర్‌లెస్‌గా తీర్చిదిద్దనున్నట్టు ప్రకటించారు. సభా కార్యకలాపాలు, ఇతర పత్రాలు ఆన్‌లైన్‌లో అందించనున్నట్టు తెలిపారు. సభ్యులు పార్లమెంటు ప్రతుల కోసం ఈ ? కాపీలనే వినియోగించేందుకు ప్రయత్నించాలని కోరారు స్పీకర్. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇకపై హార్డ్‌కాపీ, ఈ-కాపీల్లో ఏది కావాలన్న దానిపై సభ్యుల ప్రాధాన్యతను తెలుసుకుని ఆ మేరకు వారికి ప్రతులను అందజేయాలన్నారు ఓం బిర్లా.

# ప్రధానితో ఫరూక్ బృందంభేటీ

**కాశ్మీర్ ఎన్నికలపై చర్చ**

న్యూఢిల్లీ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని ఓ బృందం గురువారం ప్రధాని నరేంద్ర మోదీని కలిసింది.

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను సంవత్స రాంతంలో నిర్వహించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీతో ఈ బృందం దాదాపు 20 నిమిషాలు భేటీ అయ్యింది.

ఈ భేటీలో కశ్మీర్ లోయలో పరిస్థితి మరింత క్షీణ దశకు దారితీసే ఏ చర్యను కూడా కేంద్రం తీసుకోకూడదని ప్రధానిని కోరామని అబ్దుల్లా తెలిపారు. గతంలో కంటే లోయలో పరిస్థితి మెరుగుపడిందని, కానీ ఏ క్షణంలోనైనా పరిస్థితి క్షీణించే ప్రమాదం ఉందని ప్రధాని దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు.

ఈ అంశాలతో పాటు లోయలోని ప్రజలు ఏమనుకుంటున్నారన్న విషయాన్ని కూడా తాము ప్రధాని దృష్టికి తీసుకెళ్లామని ఫరూక్ అబ్దుల్లా మీడియాకు తెలిపారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు: ఎమ్మెల్యే పువ్వాడ

ఖమ్మం,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): ఖమ్మం నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల జాప్యంపై ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం, నర్సింహస్వామి గుట్ట రహదారి విస్తరణ పనులు నత్తనడకన ఎందుకు సాగుతున్నాయని ప్రశ్నించారు. ఏడాది క్రితం పనులు దక్కించుకొని కనీసం 50శాతం పనులు పూర్తి చేయకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆర్టీసీ సీఈని కోరారు. గుట్ట పనులు అసంపూర్తిగా ఉండటంపై పంచాయితీరాజ్ ఈఈ ప్రభాకర్, డీఈ రామాంజనేయ స్వామిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రణాళిక ప్రకారం పనులు చేయకుండా మండప నిర్మాణం ఎందుకు మార్చారని వారిని ప్రశ్నించారు. ప్రధాన అర్చకుల సూచన మేరకు దానిని మార్చినట్లు వారు వెల్లడించారు. ఆయన వెంట ఈవో జగన్మోహనరావు, స్థానిక కార్పొరేటర్లు శీలంశెట్టి రమ, ఇందిర తదితరులు ఉన్నారు. దీనికి ముందు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరమణతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

నాగులవంచలో వైద్య శిబిరం

చింతకాని మండలంలోని నాగులవంచ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణిలు, బాలింతలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వ్యాధులపట్ల సీహెచ్‌వో విజయ అవగాహన కల్పించారు. తాగునీటి, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను తరిమి కొట్టవచ్చని ఆమె సూచించారు. అనంతరం వ్యాధులు వాటి నివారణపై చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ విజయ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# జెడిఎస్ అసమ్మతి ఎమ్మెల్యేలపై వేటు

బెంగళూరు,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): కర్నాటకలో అసమ్మతి ఎమ్మెల్యేలపై చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పార్టీ ఫిరాయించారంటూ రెబల్ ఎమ్మెల్యేలపై తాను స్పీకర్‌గా ఉన్నప్పుడు కర్నాటక మాజీ స్పీకర్ రమేష్ కుమార్ అనర్హత వేటు వేశారు

. ప్రస్తుతం రెబల్ ఎమ్మెల్యేలకు మరో షాక్ తగిలింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేలపై జేడీ(ఎస్) వేటు

వేసింది. పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. నాటకీయ పరిణామాల మధ్య కర్నాటక అసెంబ్లీలో నిర్వహించిన విశ్వాస పరీక్షలో జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం, రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. తాజాగా, తమ పార్టీ నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన గోపాలయ్య, హెచ్.విశ్వనాథ్, నారాయణ గౌడను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు పార్టీ అధినేత దేవెగౌడ ప్రకటించారు.

# ఆంధ్రా వర్సిటీని సందర్శించిన గవర్నర్

## విద్యారంగ కృషి పట్ల అభినందన

విశాఖపట్టణం,ఆగస్ట్2 (ఆర్ఎన్ఎ): విద్యాభివృద్ధిలో ఆంధ్రావర్సిటీ మంచి ఫలితాలు సాధిస్తోందని ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విశాఖ ఆంధ్రావిశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాస్, ఆదిమూలపు సురేశ్ తదితరులు హాజరయ్యారు. ఏపీ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా వర్సిటీకి వచ్చిన హరిచందన్‌ను అక్కడి అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి దేశ స్థితిగతులను మార్చుతుందన్నారు. దేశ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు ఆంధ్రా యూనివర్సిటీ విశేష కృషి చేసిందనీ, భవిష్యత్‌లోనూ ఎన్నో విద్యా కుసుమాలను అందిస్తుందన్న నమ్మకం ఉందని ఆయన అన్నారు. నానాటికీ నీటి, వాయు కాలుష్యం పెరుగుతోందని..వాటిని తగ్గించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకానికి విశ్వ విద్యాలయాలు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటు పడాలని కోరారు. అనంతరం మంత్రి సురేశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు వర్సిటీల నిధులను పక్కదారి పట్టించాయని ఆరోపించారు. దీనిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. వర్సిటీల్లో విద్యార్థుల మౌలిక వసతులను మెరుగుపరుస్తామని, ఉపకులపతుల నియామకానికి కమిటీలు వేస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీకి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

విజయవాడ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కోడూరులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై పి.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరులోని ఎనిమిదో వార్డుకు చెందిన మువ్వా బోసుబాబు(50) స్థానిక గ్రామ కచేరీకి సమీపంలో ప్రధాన రహదారి పక్కనే చెప్పులు కుట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజులానే ఉదయం తన దుకాణానికి వచ్చాడు. వర్షం కురుస్తుండగా మూత్ర విసర్జనకు దుకాణం సమీపంలోనే ప్రధాన మురుగునీటి కాల్వ పక్కన ఉన్న విద్యుత్ నియంత్రిక వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు బోసుబాబుకి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ శాఖ నిర్వహణ లోపం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు అంటున్నారు. మృతుడి కుమారుడు చినబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతుడికి భార్య, వివాహమైన కుమార్తె, కుమారుడు ఉన్నారు.

# దేవాదాయశాఖ ఇవో ఇంటిపై ఏసిబి దాడులు

## ఆదాయానికి మించి ఆస్తుల గుర్తింపు

కర్నూలు,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): ఆదోని పట్టణంలో దేవాదాయ శాఖ ఈవో రాంప్రసాద్ ఇంటిపై గురువారం ఉదయం ఏసీబీ అధికారుల బృందం దాడులు నిర్వహించింది. దాడుల్లో బంగారు ఆభరణాలు, పలు డ్యాక్యుమెంట్లు నగదు తదితరాలు పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ నాగభూషణం మాట్లాడుతూ.. ఆదాయానికి మించిన ఆస్తుల సమాచారంతో కోర్టు సెర్చ్ వారెంట్ ద్వారా ఈవో రాంప్రసాద్ ఇంటిపై ఏసీబీ తనిఖీలు చేసిందన్నారు. తనిఖీల్లో మూడు నివాసాలు భార్య పేరుపై 23 హౌస్ ప్లాట్లు, రూ.3లక్షల నగదు గుర్తించామన్నారు. దీంతోపాటు 250గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రూ.28.44లక్షల వడ్డీకి ఇచ్చిన ప్రామినరీ నోట్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈయన గూడూరు గ్రూప్స్ ఆలయాల ఈవోగా పనిచేస్తున్నారన్నారు. ఈ మేరకు ఆయన్ను అరెస్టు చేశారు. శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. దాడుల్లో ఏసీబీ ఎస్సైలు ఖాదర్ బాషా, శ్రీధర్, సిబ్బంది చక్రి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# 6న ప్రధాని మోడీతో ఏపి సిఎం జగన్ భేటీ

అమరావతి,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): జెరూసలెం నుంచి తిరిగి వచ్చిన తరవాత 6 న ప్రధాని మోడితో ఏపి ముఖ్యమంత్రి జగన్ భేటీ కానున్నారు. ఈ నెల 5న జగన్ తిరిగి రానున్నారు. ఈ భేటీకి వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అనిల్ కుమార్, మేకపాటి గౌతమ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంతోపాటు జల వనరులు, పరిశ్రమలు, ఆర్థిక శాఖల ప్రత్యేక కార్యదర్శులు కూడా హాజరుకానున్నారు. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.5 వేల కోట్లను కేంద్రం రీయింబర్స్ చేయాల్సి ఉంది. ఇందులో రూ.3,600 కోట్లను మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ నిధులను త్వరగా విడుదల చేయాలని మోడిని జగన్ కోరనున్నారు. కడప స్టీల్ ప్లాంట్, విద్యా సంస్థలకు నిధులు, వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, ప్రత్యేక హోదా, దుగరాజపట్నం పోర్టు, ఆర్థిక లోటు భర్తీ తదితర అంశాలను కూడా ప్రధాని దృష్టికి జగన్ తీసుకెళ్లనున్నారు.

# వరదనీటితో నిండుకుండలా శ్రీశైలం జలాశయం

శ్రీశైలం,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): జూరాల నుండి వస్తున్న వరద నీటితో శ్రీశైలం జలాశయం శరవేగంగా నిండుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలకు వస్తున్న నీటిని వస్తున్నట్టుగా దిగువకు విడుదల చేస్తుండటం, మరోవైపు జూరాల నిండుకుండగా మారడంతో రిజర్వాయర్ నుంచి శ్రీశైలానికి 1,76,824 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరంతా శ్రీశైలానికి వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నిల్వ 215.80 టీఎంసీ లు కాగా, ప్రస్తుతం 34.24 టీఎంసీ ల నీరు ఉంది. పూర్తి స్థాయిలో నీరు నిండితే 885 అడుగుల మేరకు నీరు ఉంటుంది. బుధవారం ఉదయం జలాశయంలో 804 అడుగుల వరకూ నీరుండగా, వరద నీటి రాక ప్రారంభం కావడంతో, గురువారం ఉదయం 810 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ఈ వరద మరింతకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఇకపోతే పగిడ్యాల మండల పరిధిలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి గ్రామ సమీపాన ఉన్న కృష్ణానదికి వరదనీరు పోటెత్తింది. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి నీరు చేరేందుకు లింక్ ఛానల్ కాలువలో మినుముక్కటె అడ్డుపడటంతో నీటిచేరిక ఆలస్యమవుతోంది. ఒక్కరోజులోనే భారీగా వరదనీరు చేరుతుందని సమీప మత్స్యకారులు తెలిపారు.



గోదావరిలో వరద పరిస్థితిని అంచనా వేస్తున్న ఎపి మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ తదితరులు

# మల్లన్న సన్నిధిలో జిల్లా కలెక్టర్

శ్రీశైలం,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): శ్రీ గౌరమ్మ, మల్లికార్జున స్వామి వార్లను జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్ రవి పఠాన్ శెట్టిలు గురువారం దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన వారికి ఈవో శ్రీ రామచంద్రమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# తల్లిపాల ప్రాధాన్యంపై చైతన్యం

కర్నూలు,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): ప్రతి బిడ్డకు విధిగా తల్లిపాలు తాగించాలని పగిడ్యాల వైద్యాధికారి కృష్ణమూర్తి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని పాతకోట, లక్ష్మాపురం, పగిడ్యాల, ముచ్చుమర్రి గ్రామాల్లో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను బాలింతలకు, గర్భవతులకు వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నాగేశ్వరమ్మ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల సవరణ నిర్ణయంపై నిరసన

## సిఐటియు ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో కార్మికుల రాస్తారోకో

విశాఖపట్టణం,ఆగస్ట్2 (ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో సవరణలను చేయడాన్ని నిరసిస్తూ.. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులంతా ఏలేశ్వరంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. కార్మికులను పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టే విధంగా కార్మిక చట్టాలను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బిల్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడుతూ... కార్మికులు 50 సంవత్సరాలకుపైగా పోరాడి సాధించుకున్న కనీస వేతన చట్టంలో ముఖ్యమైన వేతన సవరణ, సమాన వేతనం, వేతన చెల్లింపులు వంటివి యాజమాన్య చేతుల్లో ఉండేలా కేంద్రం చట్ట సవరణ బిల్లు ప్రవేశ పెట్టిందన్నారు. కేరళ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.600 ఇస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం పెట్టుబడిదారులకు తొత్తిగా మారి, కేవలం రూ.178 మాత్రమే చెల్లించేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు ఏకమై పోరాటం ద్వారా కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేలా చేయాలని సోమరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుండుబిల్లి చక్రం, ఎస్.పావారావు, దుర్గారావు, కావు, ఆర్.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# రివర్స్ టెండరింగ్‌కు కసరత్తు

## కేంద్రం అనుమతి రాగానే నోటిఫికేషన్

అమరావతి,ఆగస్ట్2 (ఆర్ఎన్ఎ): నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు పోలవరం హెడ్ వర్క్స్‌లో మిగిలిన పనులతోపాటు జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనులకు ఒకే ప్యాకేజీ కింద రివర్స్ టెండరింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రివర్స్ టెండరింగ్ వల్ల పోలవరం హెడ్ వర్క్స్, జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనుల్లో భారీగా ప్రజాధనం ఆదా అవుతుందని జలవనరుల శాఖ, ఏపీ జెన్‌కో వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పీపీఏ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేయాలన్నా, కొత్తగా టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలన్నా కేంద్ర జల్ శక్తి, పీపీఏ నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ నేపథ్యంలో పోలవరం హెడ్ వర్క్స్‌లో మిగిలిన పనులకు రివర్స్ టెండరింగ్‌కు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ పీపీఏ, కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి యూపీ సింగ్‌లకు లేఖ రాయనున్నారు. పోలవరం బాధ్యతలను గత ప్రభుత్వానికి అప్పగించిన సమయంలో కేవలం నీటిపారుదల విభాగానికి అయ్యే వ్యయాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని, జలవిద్యుదుత్పత్తి కేంద్రం వ్యయంతో తమకు సంబంధం లేదని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో రివర్స్ టెండరింగ్ నిర్వహించాక పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థతో హెడ్ వర్క్స్ పనులకు జలవనరుల శాఖ, జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనులకు ఏపీ జెన్‌కో ఒప్పందం చేసుకోనున్నాయి. ఆయా పనులు చేసిన మేరకు జలవనరుల శాఖ, ఏపీ జెన్‌కోలు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించనున్నాయి.

కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నప్పుడే ఆర్థికపరమైన లావాదేవీలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మరోవైపు 960 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కేంద్రం నిర్మాణ పనుల కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని పేర్కొంటూ నవయుగ సంస్థకు ఏపీ జెన్‌కో నోటీసులు జారీ చేసింది. ఇదే అంశాన్ని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ), కేంద్ర జల్ శక్తి శాఖలకు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఓ లేఖ కూడా రాసింది. ఈ నేపథ్యంలో హెడ్ వర్క్స్, జలవిద్యుదుత్పత్తి కేంద్రం పనులకు ఒకే ప్యాకేజీ కింద రివర్స్ టెండరింగ్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. కేంద్రం నుంచి అనుమతి రాగానే ఈ పనులకు రివర్స్ టెండరింగ్ నిర్వహించేందుకు వీలుగా నోటిఫికేషన్ జారీ చేస్తామని జలవనరుల శాఖ వర్గాలు తెలిపాయి.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

## ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

కడప,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సంఘం నాయకులు నిరసన చేపట్టారు. కడపలోని స్థానిక గీతాంజలి కళాశాల నుండి కోటి రెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తమ నోళ్లకు నల్ల రిబ్బన్లను కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ... భారీ ఎత్తున విద్యార్థుల స్కాలర్‌షిప్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో రూ.3700 కోట్ల స్కాలర్‌షిప్పులు పెండింగ్‌లో ఉన్నాయని, విద్యార్థులు ప్రస్తుతం తమ విద్యను పూర్తి చేసుకొని బయట ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అన్ని రకాల సర్టిఫికెట్లు యాజమాన్యాల వద్దే ఉండడం వల్ల ఫీజులు చెల్లిస్తేనే తప్ప సర్టిఫికెట్లను విద్యార్థులకు ఇచ్చే పరిస్థితి లేదంటూ యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయని, దీని కారణంగా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన చెందారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న స్కాలర్‌షిప్ నిధులను సైతం పసుపు కుంకుమ పేరుతో ఇతర పథకాలకు మళ్లించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని దస్తగిరి ఆరోపించారు. వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు లేదంటే భారీ ఎత్తున ఉద్యమిస్తామని, రాజధాని ముట్టడికి సైతం వెనకాడబోమని దస్తగిరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మధు, సెక్రెటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరాంజి, ఉపాధ్యక్షులు కటారి శివ శంకర్, గంగరాజు, తదితరులు పాల్గన్నారు.

# అన్న క్యాంటీన్లు మూత!

- ప్రభుత్వం నుంచి రాని కొనసాగింపు ఉత్తర్వులు
- మాపై కక్షతో పేదవారి కడుపుకొట్టడం సరికాదంటూ
- వైకాపా ప్రభుత్వం తీరుపై మండిపడ్డ టీడీపీ ఎమ్మెల్సీ లోకేశ్

అమరావతి, ఆగస్టు 2(ఆర్ఎన్ఎ) : నిరుపేదల ఆకలి తీర్చే ఉద్దేశంతో నవ్యాంధ్ర వ్యాప్తంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన 'అన్న క్యాంటీన్లు' బుధవారం రాత్రితో మూతపడ్డాయి. మధ్యాహ్నం భోజనాన్ని యథావిధిగా సరఫరా చేసిన నిర్వాహకులు ఆ తర్వాత తట్టాబుట్ట సర్దుకుని వెళ్లిపోయారు. ఈ విషయం తెలియని జనం ఎప్పటిలాగే రాత్రి ఏడుగంటల సమయంలో ఆయా క్యాంటీన్ల వద్దకు చేరుకుని మూతపడి ఉండడంతో నిరాశతో వెనుదిరిగారు. అదేవిధంగా గురువారం సైతం పలువురు అన్నా క్యాంటీన్లు వద్ద భోజనం చేసేందుకు వెళ్లగా మూసి ఉండటం చూసి నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. గత ఏడాది సెప్టెంబర్ రెండో వారంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 73పట్టణాలు, నగరాల్లో ఒకేసారి 203 అన్న క్యాంటీన్లను తొలివిడత ప్రారంభించిన విషయం తెలిసిందే. డిమాండ్‌ను అనుసరించి వీటి సంఖ్యను ఆ తర్వాత కొన్ని ప్రాంతాల్లో పెంచుకుంటూ పోయారు.

రోజుకి దాదాపు 3లక్షల మందికి ఈ క్యాంటీన్లలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సరఫరా చేసేవారు. పూటకు ఐదు రూపాయలకే ఆహార పదార్థాలు సరఫరా చేయడంతో నిరుపేదలు, రోజు కూలీలు, హమాలీలు, చిరు వర్తకులు ఎక్కువమందికి క్యాంటీన్లు ఉపయోగపడ్డాయి. క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను 'అక్షయ పాత్ర ఫౌండేషన్'కు అప్పగించారు. గడచిన ఎనిమిది నెలల కాలంలో ఎంతో ప్రాచుర్యం పొందిన అన్న క్యాంటీన్లను ఆగస్టు ఒకటి నుంచి మూసివేస్తున్నారన్న ప్రచారం నాలుగు రోజుల ముందు నుంచే ప్రారంభమయ్యింది. నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అక్షయపాత్ర సంస్థ కాంట్రాక్టు గడువు జూలై 31తో ముగుస్తుండడం, ఫౌండేషన్‌కు ప్రభుత్వం నుంచి ఎటువంటి పొడిగింపు ఉత్తర్వులు అందకపోవడంతో మూసివేత ఖాయమనుకున్నారు. అయితే రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఈ అంశంపై స్పందిస్తూ క్యాంటీన్ల మూసివేత ఆలోచన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని ప్రకటించడంతో ఊరట చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వడ్డించిన అక్షయపాత్ర సంస్థ సిబ్బంది రాత్రి భోజనం సమయానికి మాత్రం సామాన్లను మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించి క్యాంటీన్లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. కాగా, క్యాంటీన్ల కొనసాగింపు ఉత్తర్వులు గురువారం వెలువడతాయని అధికారులు పేర్కొన్నా.. ఆమేరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

### మాపై కక్షతో పేదవారి కడుపుకొట్టడం సరికాదు : లోకేశ్

రాష్ట్రంలో పలుచోట్ల అన్న క్యాంటీన్లు మూతపడడంపై టీడీపీ యువనేత నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలికి రాజకీయం తెలియదు జగన్.. అయినా మా మీద కోపంతో పేదవాళ్ల కడుపుమీద కొట్టడం భావ్యం కాదంటూ హితవు పలికారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు. అంతేకాదు, మూతపడిన ఓ అన్న క్యాంటీన్ ఫొటోను కూడా ట్విట్టర్ లో పోస్టు చేశారు. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో అన్న క్యాంటీన్లకు తెలుపు రంగు వేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అన్న క్యాంటీన్లకు బడుగు, బలహీన వర్గాల నుంచి విశేష ఆదరణ లభించింది. అత్యంత చవకగా భోజనం లభిస్తుండడంతో వీటిలో ఎప్పుడూ విపరీతమైన రద్దీ కనిపించేది.

# తిరుమలలో నేడు ఆండాళ్ తిరునక్షత్రం

తిరుమల,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): తిరుమలలో ఆగస్టు 3న శనివారం శ్రీ ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర ఘనంగా జరుగనుంది. పురాణాల ప్రకారం పాండ్య దేశంలో పరమ విష్ణుభక్తుడైన శ్రీ విష్ణుచిత్తుడికి చెందిన తులసీవనంలో ఆషాడ శుక్ల చతుర్థి నాడు పూర్వఫల్గునీ నక్షత్రంలో భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు ఆవిర్భవించారు. ఈ కారణంగా కటక మాసం పూర్వఫల్గుని నక్షత్రంలో ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర నిర్వహిస్తారు. ఈ పవిత్రమైనరోజు సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు పురుశైవారితోటకు వేంచేపు చేస్తారు.

అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు బయల్దేరి పొగడ చెట్టు వద్దకు రాగానే హారతి ఇస్తారు. ఆ శేషహారతి, పుష్పసరము, శ్రీ శఠారి పొగడ చెట్టునకు సమర్పిస్తారు. శ్రీ శఠారికి అభిషేకం అనంతరం తిరిగి తిరుచ్చిపై ఉంచుతారు. అక్కడ నుంచి స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు

# మూతపడుతున్న అన్న క్యాంటీన్లు

అమరావతి,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): టిడిపి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లు ఏపీ వ్యాప్తంగా తాత్కాలికంగా మూతపడ్డాయి. పలు జిల్లాల్లో క్యాంటీన్లకు నిర్వాహకులు తాళాలు వేసేశారు. రోజులాగే అహారం కోసం వచ్చిన ప్రజలు గురువారం సైతం వెనుదిరుగుతున్నారు. గత కొన్ని రోజులుగా వివిధ జిల్లాల్లోని అన్నక్యాంటీన్లకు తెలుపు రంగు వేస్తున్నారు. మరోవైపు కొద్దిరోజుల పాటు సేవలు ఆపాలని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో పేరుమార్పుతో అందుబాటులోకి రానున్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం అన్న క్యాంటీన్లు ఉన్న ప్రదేశాలను కూడా ప్రభుత్వం మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది. అయితే, అన్న క్యాంటీన్లను పూర్తిగా మూసేసే యోచనేదీ లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పేదలకు 5ర.లకే భోజనం పెట్టించాలన్న సదాశయంతో ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేశారు.

# అన్న క్యాంటీన్లను మూసేయొద్దు: ఎమ్మెల్యే

ఏలూరు,ఆగస్ట్2 (ఆర్ఎన్ఎ):రాష్ట్రంలో రద్దు చేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి తెరవాలని కోరుతూ.. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గురువారం పాలకొల్లులోని అన్న కాంటీన్ వద్ద తన సొంత ఖర్చులతో పేదలకు భోజనాలు పెట్టారు. పేద ప్రజలకు అన్న క్యాంటిన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, పేరు మార్చుకోవచ్చు కానీ పేదలకు అన్నం పెట్టడం మాత్రం మానవద్దని రామానాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్న కాంటీన్ వద్ద పేదలకు రామానాయుడు స్వయంగా అన్నంను వడ్డించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వల్లపు నారాయణ మూర్తి, వైస్ చైర్మన్ కర్నేనా రోజా రమణి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బోనం నాని, జీవి పెచ్చెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నిలకడగా సాగుతున్న గోదావరి

## ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

రాజమహేంద్రవరం,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గత మూడు రోజుల నుంచి గోదావరికి వరద తాకిడి ఎక్కువైంది. ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ ఆనకట్ట వద్ద 9.90 అడుగుల నీటి మట్టం నమోదైంది. బ్యారేజీ వద్ద సుమారు 8 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా..డెల్టా పంట కాల్వలకు 11వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 7.85లక్షల క్యూసెక్కుల నీరు కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలో కలిసిపోతోంది. మరోవైపు గోదావరి వరద ఉధృతితో తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. మండల పరిధిలోని 26 గిరిజన గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కాజ్‌వే వరద నీటిలో మునిగిపోయింది. దీంతో కనకాయలంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కోనసీమలోనూ గోదావరి పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయినవిల్లి మండలంలోని లంక గ్రామాలకు వరద తాకిడి ఎక్కువైంది. పడవలపై ప్రయాణం తగ్గించుకోవాలని అధికారులు లంకవాసులకు విజ్ఞప్తి చేశారు.

ములుగు

# సద్వినియోగం చేసుకుంటేనే సార్థకత

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు, ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి): కల్యాణలక్ష్మి ద్వారా వచ్చే డబ్బులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటేనే పథకానికి సార్థకత ఉంటుందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని 77 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కల్యాణలక్ష్మి డబ్బును వృథా చేయకుండా పెంపు చేసుకోవాలని, తమ పిల్లల వివాహాలకు అప్పులు చేసినట్లైతే తీర్చాలని సూచించారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి కూడా కల్యాణలక్ష్మి పథకాన్ని వర్తింపజేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అధికారులు, ప్రజలు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో వసంతరావు, స్థానిక ఎంపీపీ అంతటి విజయ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, స్థానిక సర్పంచి ఈసం రామ్మూర్తి, రామన్నగూడెం సర్పంచి కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు శ్రీలత, నర్సింహులు, డిప్యూటీ తహసీల్దార్ సర్వర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# నాగాలాండ్ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి ప్రమాణం

నాగాలాండ్,ఆగస్ట్2 (ఆర్ ఎన్ఎ): నాగాలాండ్ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరూప్ కుమార్ గోస్వామి ఆయనతో ప్రమాణం చేయించారు.

రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి నాగాలాండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, స్పీకర్‌తో పాటు ప్రతిపక్ష నేత కూడా హాజరయ్యారు. డీకే రవి ఇంతకు పూర్వం ఇంటిలిజెన్స్ బ్యూరో అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. అంతేకాకుండా నాగాలతో జరిపిన శాంతిచర్చల్లో కూడా రవి కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొనే కేంద్రం ఆయన్ను నాగాలాండ్ గవర్నర్‌గా నియమించింది. ఇప్పటి వరకు పీబీ ఆచార్య నాగాలాండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ కాలం జూలై 20తో ముగియడంతో ఆర్.ఎన్. రవిని కేంద్రం గవర్నర్‌గా నియమించింది.

# గోదావరి మళ్లింపు..విభజన సమస్యలు

## సుదీర్ఘంగా చర్చించిన తెలుగు వల్లభులు

## ప్రగతి భవన్‌లో ముగిసిన కెసిఆర్, జగన్ చర్చలు

## పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయం

హైదరాబాద్,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): గోదావరి జలాల తరలింపుపై ఇరురాష్ట్రాల సిఎంలు మరోమారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రగతిభవన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సమావేశం ముగిసింది.

ఇందులో గాదావరి జలాల వినియోగంతో పాటు విభజన అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయని తెలుస్తోంది. గోదావరి జలాల మళ్లింపు, రాష్ట్ర విభజన అంశాలపై వీరు మరోమారు సుదీర్ఘంగా చర్చించారు. సుమారు మూడు గంటలకు పైగా జరిగిన సమాలోచనల్లో ప్రధానంగా గోదావరి జలాల్ని శ్రీశైలానికి తరలించడంపై చర్చ జరిగినట్టు సమాచారం. గత జూన్ 28న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా గోదావరి జలాల్ని శ్రీశైలానికి తరలించేందుకు ఇరు రాష్ట్రాల ఇంజినీర్ల కమిటీలు కొన్ని ప్రతిపా దనలు తయారు చేశాయి.

ఈ నేపథ్యంలో ఈ రోజు ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో వాటన్నింటిపైనా చర్చించినట్టు తెలుస్తోంది. గోదావరి జలాలు ఎక్కడి నుంచి తరలిస్తే మంచిది? నీటిని ఏ ప్రాంతానికి ఎలా తీసుకొస్తే వ్యయం తక్కువగా ఉంటుంది? నీరు సునాయాసంగా ఎలా చేరుతుందనే అంశంపై ఇద్దరు సీఎంలు సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. ఏపీ, తెలంగాణ మధ్య విభజన చట్టంలో కొన్ని సమస్యలకు సంబంధించిన అంశాలపైనా చర్చించారు.

ఇప్పటికే దీనిపై ఉన్నతాధికారులు కసరత్తు చేశారు. ఏ అంశానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయనే దానితో పాటు పరిష్కారం కోసం ఎలా ముందుకెళ్లాలనే దానిపైనా చర్చించినట్టు సమాచారం. ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపకం సహా విద్యుత్ బకాయిలు, 9, 10 షెడ్యూళ్లలోని సంస్థల విభజన తదితర అంశాలపైనా సీఎంల భేటీలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈనెల 8న కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర విభజన అంశాలపై సమీక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఈ సమావేశం నేపథ్యంలో సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై సీఎంలు చర్చించినట్టు తెలుస్తోంది. అలాగే, ఇరు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాలపైనా చర్చించినట్టు సమాచారం. సీఎంలతో పాటు ఈ సమావేశంలో తెలంగాణ నుంచి వినోద్, సంతోష్, ఏపీ నుంచి మిథున్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



8. ప్రగతిభవన్‌లో సిఎం కెసిఆర్‌తో భేటీ అయిన ఎపి సిఎం జగన్. చిత్రంలో ఎంపి సంతోష్, ఎపి ఎంపి మిధున్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు.

# ఆయుర్వేద ఆస్పత్రిని ఎందుకు తరలిస్తున్నారు: విహెచ్

హైదరాబాద్,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): చార్మినార్ వద్ద ఉన్న ఆయుర్వేద ఆస్పత్రిని ఎందుకు తరలిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత విహనుమంతరావు ప్రశ్నించారు.

చారిత్రక ఆస్పత్రిని తరలించడం వెనుక ఉన్న ఆంతర్యమేంటని ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణిని నిలదీశారు. ఆమెను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్య విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థినులు ధర్నా చేస్తున్నప్పుడు పోలీసులు ఎందుకు తప్పుగా ప్రవర్తించారని మండిపడ్డారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే తప్పుగా ప్రవర్తించడమేనా?అని ప్రశ్నించారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రకటనలు కాకుండా చర్యలు తీసుకోవాలని వీహెచ్ డిమాండ్ చేశారు. ఆస్పత్రి భవనం పాతబడింది గనుక తరలిస్తున్నామని చెప్పడం మాత్రం సబబుగా లేదన్నారు. ఉస్మానియా ఆస్పత్రి కూడా పాతదైనా అక్కడే వైద్యం కొనసాగుతోందని.. అక్కడ నిర్మిస్తామని చెప్పిన ఆస్పత్రి కొత్త భవనం ఏమైందని ప్రభుత్వాన్ని వీహెచ్ నిలదీశారు.

# రాజధాని సభ్యత్వ నమోదు పదికల్ల పూర్తి

## తెలంగాణభవన్‌లో సమీక్షించిన కేటీఆర్

హైదరాబాద్,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): రాజధానిలో సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోందని, ఆగస్టు 10వ తేదీ నాటికి సభ్యత్వం పూర్తి చేయాలని పార్టీ ఇంచార్జీలతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మిగతా ప్రాంతాల్లో సభ్యత్వ నమోదుపూర్తి కాగా జంటనగరాల్లో వెనకబడింది. తెలంగాణ భవన్‌లో సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్ పరిధిలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యేలు, పార్టీ ఇంచార్జ్జిలతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమై చర్చించారు. 10 నుంచి 20వ తేదీ వరకు బస్తీ, డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయాలి. ప్రతి కమిటీలో కనీసం 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలుండాలి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పని చేయాలి. చాలా నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చురుగ్గా కొనసాగుతోంది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నగర ప్రజల్లోకి తీసుకుపోవాలి. సీఎం కేసీఆర్ ముందుచూపు వల్లే నగరంలో తాగునీటి, విద్యుత్ కొరత లేదు. రాజకీయంగాను నగరంలో టీఆర్ఎస్ పార్టీకి ఎదురులేదు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి అని కేటీఆర్ సూచించారు. అయితే బోనాల ఉత్సవాల కారణంగా కొంత వెనకబడ్డామని తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు.

ఏపీ వార్తలు...

## స్వలాభం కోసమే ..

# జగన్ 'పోలవరం' పంచాయితీ

## - జగన్‌మోహన్ రెడ్డిది పులివెందుల న్యాయం

## - ట్రాన్స్‌ట్రాయ్ నుంచి నిబంధనల మేరకే నవయుగకు పనులు

## - మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

అమరావతి, ఆగస్టు2(ఆంఎన్ఎ): తెలుగు వారి కల అయిన పోలవరం ప్రాజెక్టు విషయంలో తొలి నుంచీ దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం, ఆ ప్రభుత్వ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎట్టకేలకు పులివెందుల పంచాయతీ ద్వారా పనులు అడ్డుకునే ప్రయత్నానికి తెర తీశారని మాజీ మంత్రి దేవినేని ఉమామ హేశ్వం రావు ఎద్దేవా చేశారు. శుక్రవారం అమరావతిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఫనసైల్ ఎకౌంటు సెటిల్ చేసుకునేందుకే ఈ పంచాయతీ అన్నారు. పోలవరం టెండర్లపై ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు.

పోలవరం వద్ద వరద ఉధృతిని అంచనా వేస్తున్న సమయంలో 15రోజుల్లో అకౌంట్ సెటిల్ చేసుకోమనడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఏదో జరిగిపోయిందని ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చేందుకు చాలా కష్టపడుతున్నారని దేవినేని ఎద్దేవాచేశారు. కమిటీ రిపోర్ట్ బయట పెట్టకుండా పనుల కాంట్రాక్టును రద్దు చేయడం ఏమిటన్నారు.

అకారణంగా పనులు నిలిపివేశారని ఆరోపించారు. 77శాతానికిపైగా పనులు టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేసిందని, ట్రాన్స్ ట్రాయ్ నుంచి నిబంధనలకు అనుగుణంగా నవయుగకు పనులు అప్పగించామని వెల్లడించారు. కేంద్ర జలవనరుల శాఖ, నిపుణులు, ఇంజనీర్ల పర్యవేక్షణలో పోలవరం కట్టామన్నారు. అటువంటిది అవినీతి పేరుతో ఎటువంటి నోటీసులు లేకుండా పనులు ఎలా ఆపేస్తారని దేవినేని ప్రశ్నించారు. మట్టి పనులు తన వారికి కట్టబెట్టేందుకు, విద్యుత్ ప్రాజెక్టు చేజిక్కించుకోవడానికి ఈ కుయుక్తులని మాజీ మంత్రి ధ్వజమెత్తారు.

# పింగళి సేవలు మరువలేం

## - ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండి పోతాయని ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని ఈ మేరకు ఆయన ట్విటర్‌లో పోస్టు చేశారు. ఏపీకి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన పోరాటం సదా స్మరణీయమన్నారు. అదేవిధంగా పింగళి వెంకయ్య సేవలను ఏపీ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు కొనియాడారు. భారతదేశానికి జాతీయపతాకాన్ని అందించిన గౌరవం తెలుగువారికి దక్కించిన మహనీయుడు పింగళి వెంకయ్యఅని తన ట్విటర్‌లో తెలిపారు. వందేమాతరం, హోమ్‌రూల్ వంటి ఉద్యమాల్లో పింగళి పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శనీయమన్నారు. జాతీయపతాక రూపకర్త, స్వాతంత్ర్య పోరాట యోధుడైన పింగళి వెంకయ్య.. వ్యవసాయ, భూగర్భ శాస్త్ర పరిశోధనలలో సైతం ఎంతో కృషిచేశారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తెలిపారు. స్వాతంత్ర్యం÷-ర వచ్చాక ఖనిజ పరిశోధకశాఖ సలహాదారుగా దేశానికి సేవలందించారన్నారు. ఆ మహనీయుని దేశసేవను స్మరించుకుందామని ఆయన ట్విటర్‌లో పోస్టు చేశారు. 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణపింగళి వెంకయ్య 142వ జయంతి వేడుకలను విశాఖలో నిర్వహించారు. ఈ సందర్భంగా 100 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు.



హరిత విజయనగరంలో భాగంగా పట్టణంలో మొక్కలు నాటిన కలెక్టర్ హరిజవహర్ లాల్

# కుల్‌భూషణ్ విషయంలో పాక్ అంగీకారం

## ప్రతిపాదన అందిందన్న విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ): మాజీ నావికా దళ కమాండర్ కుల్‌భూషణ్ జాదవ్‌కు కన్సులర్ యాక్సెస్‌కు అవకాశం కల్పిస్తామని పాకిస్థాన్ పంపిన ప్రతిపాదన అందిందని భారత దేశం పేర్కొంది. ప్రస్తుతం పాకిస్థాన్ జైలులో శిక్ష అనుభవిస్తున్న జాదవ్‌కు భారత దౌత్యాధికారులను సంప్రదించే హక్కును అమలు చేస్తామని పాకిస్థాన్ ప్రతిపాదించినట్లు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం ధ్రువీకరించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మాట్లాడుతూ కుల్‌భూషణ్ జాదవ్‌కు కన్సులర్ యాక్సెస్ కల్పిస్తామని పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనపై ప్రస్తుతం అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) తీర్పు నేపథ్యంలో అధ్యయనం జరుగుతోందని తెలిపారు. అధ్యయనం తర్వాతే తగిన స్పందన సాధ్యమవుతుందని తెలిపారు. దౌత్య మార్గాల్లో దీనిపై సంప్రదింపులు కొనసాగిస్తామని చెప్పారు. దౌత్య మార్గాల్లోనే సకాలంలో స్పందనను తెలియజేస్తామన్నారు. ఐసీజే తీర్పు నేపథ్యంలో కుల్‌భూషణ్ జాదవ్‌కు భారత దేశ దౌత్యాధికారులతో మాట్లాడే హక్కును అమలు చేస్తామని పాకిస్థాన్ అంగీకరించింది. రెండు వారాల అనంతరం గురువారం దీనికి సంబంధించిన ప్రకటనను పాకిస్థాన్ విదేశీ వ్యవహారాల శాఖ విడుదల చేసింది. జూలై 18న ఐసీజేలో పాకిస్థాన్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పాకిస్థాన్ మిలిటరీ కోర్టు భారతదేశానికి చెందిన కమాండర్ కుల్‌భూషణ్ జాదవ్‌కు విధించిన మరణ శిక్షను ఐసీజే సస్పెండ్ చేసింది. ఆయనకు వియెన్నా ఒప్పందం ప్రకారం లభించిన హక్కులను కల్పించలేదని పాకిస్థాన్‌ను తప్పుబట్టింది. ఏ దేశంలోనైనా విదేశీయులు పట్టుబడితే వారి స్వదేశానికి చెందిన దౌత్యాధికారులతో మాట్లాడే హక్కు వారి ఉందని ఈ ఒప్పందం చెప్తోంది. జాదవ్‌కు విధించిన శిక్షను, దోషిత్వ నిర్ధారణను పునఃపరిశీలించాలని పాకిస్థాన్‌కు తెలిపింది. వియెన్నా ఒప్పందం ప్రకారం జాదవ్‌కు భారత దేశ దౌత్యవర్గాలతో మాట్లాడే అవకాశం కల్పించడం లేదని, ఈ ఒప్పందాన్ని పాకిస్థాన్ తీవ్రంగా ఉల్లంఘిస్తోందని భారత ప్రభుత్వం చేసిన వాదనను ఐసీజే 15-1 తేడాతో ఆమోదించింది. కుల్‌భూషణ్ జాదవ్ మాజీ భారత నావికా దళం కమాండర్. ఆయనను 2016 మార్చిలో బలూచిస్థాన్‌లో పాకిస్థాన్ అరెస్టు చేసింది. ఆయన ఓ గూఢచారిగా తమ దేశానికి వచ్చారని అసత్య ఆరోపణలు చేసింది.

# రాజమండ్రి జైలులో ఖైదీలకు హెచ్ఐవి

## ఘటనపై ఎపి హైకోర్టు సరీయస్

## నివేదిక సమర్పించాలని ఆదేశాలు

రాజమండ్రి,ఆగస్ట్2 (ఆంఎన్ఎ): రాజమండ్రి సెంట్రల్ జైలులో 27 మంది ఖైదీలకు హెచ్ఐవి సోకింది.

ఈ అంశంపై ఎపి హైకోర్టు తీవ్రంగా స్పందించింది, వెంటనే వారికి వైద్య పరీక్షలు చేయించి, అందుకు సంబంధించిన నివేదికు కోర్టుకు ఇవ్వాలని ఆదేశించింది. జైలుకు వచ్చిన తరువాత వారికి హెచ్ఐవి సోకినట్టు నిర్ధారణ అయితే జైలు సూపరింటెండెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని కోర్టు తేల్చి చెప్పింది.

గత నెల రాజమండ్రి జైలులో ఖైదీలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ క్రమంలో 27 మందికి హెచ్ఐవి సోకినట్టు నిర్ధారణ అయింది. దీనిపై ఖైదీల బంధువులు హైకోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో జైలు అధికారులపై హైకోర్టు మండిపడింది. ఏళ్ల తరబడి జైల్లో మగ్గుతున్నవారికి కూడా హెచ్ఐవి ఎలా సోకిందని హైకోర్టు జైలు అధికారులను ప్రశ్నించింది. వెంటనే ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేసి , నివేదికను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది.

# పెన్షన్ల పంపిణీ చేపట్టిన అధికారులు

విశాఖపట్టణం,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం అందజేస్తున్న నూతన పింఛను పంపిణీ కార్యక్రమాన్ని ఆనందపురం మండలంలోని వేములవలస పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ఉదయం 7 గంటలకే కార్యాలయానికి చేరుకున్న సిబ్బంది పింఛను దారులకు రూ.2,250 మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది మాట్లాడుతూ.. సర్వర్లు మొరాయించకుండా ఉండేందుకు ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ఎండదెబ్బ తగలకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీలో 650 మంది పింఛనుదారులున్నారని వీరికి రెండు, మూడు రోజుల్లో పింఛను అందజేస్తామని వెల్లడించారు.

## సంగారెడ్డి

# సరిహద్దు గ్రామాల రోడ్లు బాగుచేయండి

సంగారెడ్డి, ఆగస్టు 2, (నేటినిజం ప్రతినిధి): నారాయణఖేడ్ నుండి మనూర్ మండలం న్యాల్కల్ మండలం మీదుగా జహీరాబాద్ వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా అద్వానంగా పాడైందని అక్కడి ప్రజలు వాపోతున్నారు ఆ రోడ్డు దాదాపు 50 కిలోమీటర్ల మేర గుంతల మయంగా మారింది. నారాయణఖేడ్ నుండి జహీరబాద్ కు ప్రతి రోజు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. మోకాళ్లలోతు గుంతలు పడడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన న్యాల్కల్ నుండి డప్పూర్, డప్పూర్ నుండి వడ్డీ గ్రామము అక్కడ నుండి శంషల్ పూర్ మీదుగా బీదర్ వెళ్లే రహదారులు ప్రయాణికులకు కాలినడకన నడవలేని దుస్థితికి మారాయని ప్రజలు ఆవేదన పడుతున్నారు. వాహనాలు, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు ఎంతోమంది ఈ రహదారులపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారు. బంగారు తెలంగాణ ప్రభుత్వంలో భాగంగా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్డు బాగుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

# హెల్మెట్ ధరించేలా చైతన్యం

హైదరాబాద్,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): రవాణా శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్‌ల వాడకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని హైదరాబాద్ జిల్లా రవాణా అధికారులు తెలిపారు. ఆటో మొబైల్ డీలర్లు, స్వచ్ఛందసంస్థల సహకారంతో హెల్మెట్లను తప్పనిసరిగా ధరించేలా ప్రోత్సహిస్తారు. బైకు కొన్నప్పుడే హెల్మెట్ ఉండేలా చర్యలు తీసుకోబోతున్నారు. గ్రేటర్ పరిధిలో అమలు చేస్తున్న పాయింట్ల విధానం వాహనదారులకు ఓ హెచ్చరిక లాంటిదని అన్నారు. ఇప్పటివరకూ చలాన్లు రాని జరిమానాలు వసూలు చేసిన ట్రాఫిక్ పోలీసులు ఇకపై అదనంగా ఆయా వాహనదారులకు పాయింట్లను నమోదు చేస్తున్నారు. ఇదిలావుంటే సురక్షిత వాహన ప్రయాణానికే ట్రాఫిక్ నిబంధనలు అనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలని, నిబంధనలు ఉల్లంఘించకుండా వాహనాలు నడిపితే అందరూ సురక్షితంగా ప్రయాణిస్తారని రాచకొండ సీపీ మహేష్ భగవత్ అన్నారు. ఎంవీ యాక్టులో నియమాలను అమలు పరిచే దిశగా ట్రాఫిక్ విభాగం అడుగులు వేస్తుందన్నారు. ట్రాఫిక్ అధికారుల ట్యాబ్‌లో సంబంధిత సాఫ్ట్‌వేర్ అపడేట్ చేశారన్నారు. ప్రజలకు ప్రధానంగా వాహనాదారులకు ఈ పాయింట్లపై అవగాహన కల్పించడానికి కరపత్రాలు, పోస్టర్లు రూపొందించారు. వాహనం నడిపేటప్పుడు అన్ని జాగ్రత్తలూ పాటిస్తూ జీరో పాయింట్లతో హీరోగా ఉండాలని పౌరులకు సూచించారు. జీరో పాయింట్లు కొనసాగిస్తూ హీరోలుగా ఉండండని పేర్కొన్నారు.

# శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదల

### - నవంబర్ నెలకు అందుబాటులో 69,254 టికెట్లు

చిత్తూరు, ఆగస్టు 2(ఆర్ఎన్ఎ) : నవంబరు నెల కోటా కింద తిరుమల శ్రీవారి వివిధ ఆర్జిత సేవలకు సంబంధించిన టిక్కెట్లను టీటీడీ శుక్రవారం విడుదల చేసింది. మొత్తం నవంబరు నెలకు 69,254 టిక్కెట్లను అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. వీటిలో 10,904 టిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా భక్తులకు కేటాయిస్తారు. మిగిలిన 58,350 టికెట్లను కరెంటు బుకింగ్ కింద అందుబాటులో ఉంచారు. ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా కేటాయించే వాటిలో సుప్రభాత సేవకు 7,549, తోమాల సేవకు 120, అర్చనకు 120, అష్టదళ పాదపద్మారాధనకు 240, నిజపాద దర్శనం కోసం 2875 టికెట్లు ఉన్నాయి. కరెంటు బుకింగ్ కింద 58,350 టికెట్లను విడుదల చేయగా వీటిలో విశేష పూజ 1,500, కల్యాణోత్సవం 13,300, ఊంజల్‌సేవ 4,200, ఆర్జిత బ్రహ్మోత్సవం 7,700, వసంతోత్సవం 14,850, సహస్రదీపాలంకరణ సేవకు 16,800 టిక్కెట్లు ఉన్నాయి. ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా కేటాయించే టిక్కెట్లకు ముందుగా భక్తులు తమ పేర్లను నమోదుచేసుకోవాలి. ఇందుకు నాలుగు రోజులపాటు అవకాశం కల్పించింది. ఆగస్టు 6 మంగళవారం ఉదయం 10 గంటల్లోగా పేర్లను నమోదుచేసుకున్న భక్తులకు డిప్ విధానంలో టిక్కెట్లు కేటాయిస్తారు. డిప్ ద్వారా టిక్కెట్ల పొందిన భక్తుల మొబైల్స్‌కు సమాచారం వస్తుంది. వీరు ఆన్‌లైన్ నగదు చెల్లించి తమ టిక్కెట్లను ఖరారు చేసుకోవాలి. ఆన్‌లైన్ జనరల్ కేటగిరి కింద విశేషపూజ, కల్యాణోత్సవం, ఊంజలసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ టిక్కెట్లను విడుదల చేసిన వెంటనే బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. శ్రీవారి సేవా టికెట్ల కేటాయింపులో ఇటీవల టీటీడీ కీలక మార్పులు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. పాత విధానంలోని లోపాలను అక్రమార్కులు తమకు అనుకూలంగా మలచుకోవడంతో టీటీడీ కొత్త నిబంధనలు రూపొందించింది. కొత్త నిబంధన ప్రకారం.. ఒక మెయిల్ ఐడీ, ఒక ఫోన్ నెంబరుతో మాత్రమే బుక్ చేసుకోవాలి. గతంలో ఈ విధానం లేకపోవడంతో వందలాది నకిలీ ఐడీలతో పేరు నమోదు చేసుకోవడం, ఎలక్ట్రానిక్ లాటరీ విధానంలో టిక్కెట్లు దక్కించుకుని, వాటిని ఇతరులకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడం తెలిసిందే.

# అగ్రరాజ్యం నిర్ణయం పట్ల భారత్ ఆందోళన

### - పాక్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాలు విక్రయానికి అమెరికా అంగీకారం

న్యూఢిల్లీ, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : పాకిస్థాన్‌కు ఎఫ్-16 విషయంలో సైనిక సహకారం కల్పించాలన్న అమెరికా నిర్ణయం పట్ల భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల పాకిస్థాన్‌కు 125 మిలియన్ డాలర్లు విలువ చేసే ఎఫ్-16 యుద్ధ విమానాలను విక్రయించడానికి అమెరికా అంగీకరించిన విషయం తెలిసిందే. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని భారత్‌లోని అమెరికా రాయబారితో పాటు వాషింగ్టన్‌లోని ట్రంప్ పాలక వర్గం దృష్టికి తీసుకెళ్లామన్నారు. పాక్‌కు సైనిక సహకారం అందించడంపై భారత్ ఆందోళనను వారికి తెలియజేశామని తెలిపారు. అయితే ఇది కేవలం ఎఫ్-16కు సాంకేతిక సహకారం, అదనపు హంగులు, శిక్షణ అంశాలు, పూర్తి స్థాయి పర్యవేక్షణకు మాత్రమే పరిమితమని.. పూర్తి స్థాయి సైనిక సహకారం రద్దు విషయంలో ఎలాంటి మార్పు ఉండదని అమెరికా స్పష్టం చేసిం దనాన్రు. అలాగే దీనిపై అమెరికా రాయబారిని సౌత్ బ్లాక్‌కు పిలిచి తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్‌కు 125 మిలియన్ డాలర్లు (రూ. 860 కోట్లు) విలువ చేసే ఎఫ్-16 యుద్ధ విమానాలను విక్రయించనుంది. వీటికి పాకిస్థాన్ సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొమ్మును ఎఫ్-16 యుద్ధ విమానాల పర్యవేక్షణ నిమిత్తం పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఉన్న 60 మంది అమెరికా కాంట్రాక్టర్లకు జీతాల చెల్లింపు నిమిత్తం ఉపయోగించనుంది. ఎఫ్-16లను ఏ విధంగా ఉపయోగిస్తున్నదీ వారు ప్రతిక్షణం పర్యవేక్షిస్తుంటారు. పాకిస్థాన్‌కు మిలటరీ సహాయం నిలిపివేయాలన్న నిర్ణయంలో మార్పు లేదని- యుద్ధ విమానాల విక్రయానికి, దానికి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు.

# పోలీస్ ఫిర్యాదుతో కక్ష

### మహిళ కుమారుడిని హత్యచేసిన వ్యక్తి

లక్నో,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. పర్సుపోయిన మహిళ ఓ వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీనిపై కక్ష పెంచుకున్న ఆ వ్యక్తి ఆమె కుమారుడిని హతమార్చాడు. అహియాపూర్‌లోని ఓ స్కూల్ ప్రాంగణంలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి హత్యకు గురయ్యాడు. సూరజ్‌కుమార్ అనే విద్యార్థి స్కూల్‌లో హత్యకు గురయ్యాడని ముజఫర్‌పూర్ డీఎస్పీ ముకుల్ కుమార్ రంజన్ తెలిపారు. అహియాపూర్ గ్రామానికి చెందిన మహిళ పర్సును ఓ వ్యక్తి దొంగిలించాడు. దీంతో ఆ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆ వ్యక్తి సదరు మహిళపై కక్ష పెంచుకుని ఆమె కుమారుడిని హత్య చేశాడు. మహిళ ఫిర్యాదు మేరకు ఓ నిందితుడిని అరెస్ట్ చేశామని డిఎస్పీ తెలిపారు. మరో వ్యక్తి కూడా ఈ హత్య వెనుక ఉన్నట్లు భావిస్తున్నామని, అతన్ని కూడా అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

## అల్పపీడన ప్రభావంతో వర్ష సూచన

అమరావతి,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన కారణంగా ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయని ఆర్టీజీఎస్ అధికారులు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీవరకు అల్పపీడనం ప్రభావం కొనసాగనుంది. ఈ కారణంగా గంటకు 50 నుంచి 70 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచనున్నాయి. జాలర్లు వేటకు వెళ్లొద్దని ఆర్టీజీఎస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలతో గోదావరిలో వరద ఉధృతి పెరిగింది. అయితే ధవళేశ్వరం బ్యారేజ్ దగ్గర గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం దగ్గర ప్రస్తుతం నీటిమట్టం 8.6 అడుగులకు చేరుకుంది. 6.39లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు.

## అదనపు బలగాలు పంపామన్నది అవాస్తవం

### - కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్‌కు అదనంగా మరో 28వేల పారామిలటరీ బలగాలను తరలించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం తోసిపుచ్చింది. ఈ మేరకు పార్లమెంట్‌లో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈనెల 26న జమ్మూకశ్మీర్‌కు 10 వేల అదనపు బలగాలు పంపిన కేంద్రం నిర్ణయించింది. అయితే, దీనికి అదనంగా మరో 28,000 బలగాలను పంపుతూ కేంద్రం తాజాగా నిర్ణయించినట్టు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని హోం శాఖ వర్గాలు వివరణ ఇచ్చాయి. వంద కంపెనీల అదనపు పారామిలటరీ బలగాలను జమ్మూకశ్మీర్ పంపేదుకు వారం రోజుల క్రితం ఇచ్చిన ఆదేశాల ప్రకారం బలగాలు తమతమ స్టేషన్లకు చేరుకునే పక్రియ మొదలైనట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. పారామిలటరీ బలగాల మోహరింపు, కదలికలకు సంబంధించినవి ఎప్పుడూ పబ్లిక్ డొమైన్‌లో చర్చనీయాంశాలు కావన్నారు. కేంద్ర బలగాల ప్రవేశం, ఉపసంహరణ అనేవి నిరంతర, డైనమిక్ పక్రియ అని, అంతర్గత భద్రత, శిక్షణ, తదితర అవసరాలను బట్టే ఇలాంటి నిర్ణయాలు ఉంటాయని ఆ వర్గాలు పేర్కొన్నారు. కాగా, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే ఆర్టికల్ 35ఏ రద్దుపై వస్తున్న ఊహాగానాలతో కశ్మీర్ లోయలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్రం అదనపు బలగాలను తరలింపునకు సీ-17 హెవీ లిఫ్ట్ విమాన సర్వీసులను రంగంలోకి దింపింది.

## పునరావాస పరిహారం వెంటనే చెల్లించాలి

భద్రాచలం,ఆగస్ట్2 (ఆర్ఎన్ఎ): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస పరిహారం వెంటనే విడుదల చేయాలని సిపిఎం నాయకుడు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. భూములకు పరిహారం ఇచ్చి నిర్వాసితులకు పునరావాస పరిహారం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కొందరు భూస్వాములు పేదలకు పరిహారం ఇస్తే తమ భూమిలోకి కూలీలు రారని ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. అది వారి వర్గదురహంకారాన్ని వెల్లడిస్తుందన్నారు. పరిహారం విడుదల కాకపోవడానికి వీరి పైరవీలేమైనా లేక ఏదైనా కారణాలున్నాయో తెలపాలని ప్రశ్నించారు. తక్షణం పునరావాస పరిహార లబ్ధిదారుల జాబితాను విడుదల చేయాలని కోరారు. పునరావాస ప్యాకేజీ తెలంగాణలో కుటుంబానికి రూ.12 లక్షల 50 వేలు ఇస్తున్నారని ఇక్కడ కూడా అదే ప్యాకేజీ ఇవ్వాలన్నారు. గిరిజనులకు భూమికి భూమి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఇచ్చి, పునరావాస కాలనీలు కుక్కునూరులో నిర్మిస్తే వ్యవసాయం ఎలా చేయుగలరని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని కోరారు.

## అనర్హతపై సుప్రీంను ఆశ్రయించిన కర్నాటక ఎమ్మెల్యేలు

బెంగళూరు, ఆగస్ట్ 2 (ఆర్ఎన్ఎ): కర్ణాటకలో అనర్హత వేటు పడిన 14 మంది ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కర్ణాటక మాజీ స్పీకర్ రమేశ్ కుమార్ అనర్హత వేటు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 14 మంది ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మాజీ స్పీకర్ రమేశ్ కుమార్ రాజీనామాలు తిరస్కరించి, అనర్హత వేటు వేయడాన్ని ఎమ్మెల్యేలు కోర్టులో సవాలు చేశారు. 13 మంది కాంగ్రెస్, ముగ్గురు జేడీ(ఎస్), ఓ స్వతంత్ర ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేస్తూ మాజీ స్పీకర్ సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

# ట్రంప్ పెత్తనం అక్కర్లేదు..

### - కాశ్మీర్ విషయంలో అమెరికాకు తెగేసి చెప్పిన భారత్..!

### - అమెరికా విదేశాంగ మంత్రి భేటీలో వెల్లడించిన మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : కశ్మీర్ సమస్య పరిష్కారం కోసం భారత్, పాక్ మధ్య పెద్దన్న పాత్ర పోషించేందుకు సిద్ధమంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా ప్రతిపాదనను భారత్ తోసిపుచ్చింది. ఇది ఇరు దేశాలకు సంబంధించిన ద్వైపాక్షిక అంశం మాత్రమేనని పునరుద్ఘాటించింది. 9వ తూర్పు ఆసియా విదేశాంగ మంత్రుల సమావేశాల సందర్భంగా శుక్రవారం అమెరికా విదేశాంగ మంత్రి మైకేల్ పాంపియోతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య కశ్మీర్ మధ్యవర్తిత్వం అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. కశ్మీర్‌పై ఎలాంటి చర్చలైనా కేవలం భారత్, పాకిస్తాన్‌ల మధ్యే జరుగుతాయని పాంపియోకి స్పష్టం చేసినట్టు జైశంకర్ ట్వీట్ చేశారు. అది కూడా ద్వైపాక్షికంగానే తేల్చుకుంటామని పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. ఇటీవల పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అమెరికాలో పర్యటించిన సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ కశ్మీర్‌పై భారత్, పాకిస్తాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తానంటూ వ్యాఖ్యానించి అందరినీ విస్మయానికి గురిచేసిన సంగతి తెలిసిందే. భారత ప్రధాని నరేంద్ర మోదీ తనను మధ్యవర్తిత్వం కోసం అడిగారని కూడా ట్రంప్ పేర్కొన్నారు. కొద్ది గంటల్లోనే భారత్ దీన్ని కొట్టిపారేయడంతో.. వివరణ ఇచ్చుకోలేక అమెరికా ప్రభుత్వం మల్లగుల్లాలు పడింది. ఈ పరిణామాల తర్వాత భారత్, అమెరికాల మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరగడం ఇదే తొలిసారి. కాగా పాంపియో-జైశంకర్ భేటికీ కొద్ది గంటల ముందే మధ్యవర్తిత్వం అంశాన్ని ట్రంప్ మరోసారి ప్రతిపాదించడం గమనార్హం. అయితే ఈసారి ఆయన ఆచితూచి స్పందించారు. భారత్, పాకిస్తాన్ కోరితేనే తాను కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం వహిస్తాననీ.. ఇది పూర్తిగా ఆ రెండు దేశాలకు సంబంధించిన విషయమని ట్రంప్ పేర్కొన్నారు.

## యూఏపీఏ బిల్లుకు

# రాజ్యసభ ఆమోదం




### - అనుకూలంగా 147ఓట్లు, వ్యతిరేఖంగా 42ఓట్లు నమోదు

### - వీగిపోయిన స్థాయీ కమిటీకి పంపామన్న విపక్షాల డిమాండ్

### - బిల్లుపై వాడివేడిగా సాగిన చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) సవరణ బిల్లు (యుఏపీఏ)కు శుక్రవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై సభలో చర్చ అనంతరం డివిజన్ పద్ధతిలో ఓటింగ్‌ను చైర్మన్ వెంకయ్యనాయుడు నిర్వహించారు. సవరణ బిల్లుకు అనుకూలంగా 147ఓట్లు, వ్యతిరేకంగా 42 ఓట్లు పడ్డాయి. దీంతో రాజ్యసభలో బిల్లు నెగ్గింది. యూఏపీఏ సవరణ బిల్లును స్థాయీ కమిటీకి పంపాలన్న విపక్షాల డిమాండ్ వీగిపోయింది. ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా 104 మందిసభ్యులు, అనుకూలంగా 85 మంది సభ్యులు ఓటు వేశారు. ఇదిలా ఉంటే అంతకుముందు దీనిపై జరిగిన చర్చలో కాంగ్రెస్ నేత పి.చిందబరం మాట్లాడుతూ.. మామూలు వ్యక్తులనుసైతం ఉగ్రవాదులుగా ప్రభుత్వం ముద్రవేసేందుకు బిల్లు వీలు కల్పిస్తుందని, ఇది సరికాదని అన్నారు. సవరణలకు మీరు కారణాలు చెబుతూ చెబుతూ.. ఎన్ఏఐకు అధికారులు పెరుగుతాయంటారు. ఆమోదం లభించిన తర్వాత వ్యక్తులను ఉగ్రవాదులుగా పేర్కొనడం, లేదా తొలగించే హక్కు కేంద్రానికి ఉందంటారు. ఈ భిన్న ధోరణి వల్లే మేము ఈ సవరణను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. అంతేకానీ, మేము యూపీఏపీకి వ్యతిరేకం కాదుని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హోం మంత్రి అమిత్‌షా.. తాను సవరణ మాత్రమే తెస్తున్నానని, చట్టాన్ని తీసుకురావడం లేదన్నారు. సంస్కరణలను ఏ విధంగా చేస్తామో అలాగే ఉగ్రవాదుల విషయంలో మరో ముందడుగు మాత్రమే తాము వేస్తున్నామని అన్నారు. గత సవర్ణలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకున్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. నేడు అటువైపు (విపక్షం వైపు) ఉన్నంత మాత్రాన వైఖరి మారిపోతుందా..? ఎందుకలా అంటూ కాంగ్రెస్ నేతలను అమిత్‌షా నిలదీశారు. కాగా, ఈ బిల్లు కింద ఏ రాష్ట్రంలోనైనా, ఎవరినైనా ఎన్ఐఏ అరెస్ట్ చేయువచ్చని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ చర్చలో పాల్గొంటూ ఆందోళన వ్యక్తంచేశారు. బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ మాట్లాడుతూ, చట్టాన్ని దుర్వినియోగం చేయమని ప్రభుత్వ, హోం శాఖ హామీ ఇవ్వాలని కోరారు. టెర్రరిస్టు అంటే టెర్రరిస్టేనని, చిన్నచిన్న సవరణలకు తాము వ్యతిరేకం కాదని ఆయన అన్నారు. వైఎస్ఆర్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి యూఏపీఏ బిల్లుకు మద్దతు తెలిపారు. టెర్రరిస్టు రహిత దేశంగా భారత్‌ను మార్చాలన్న హోం మంత్రి విజన్‌కు తమ పార్టీ మద్దతిస్తోందని విజయసాయిరెడ్డి తెలిపారు.

# హరితహారం నిత్యపాఠం కావాలి

### విద్యార్థులకు కడియం శ్రీహరి సందేశం

### పాఠశాల విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యాన్ని గుర్తించాలని సూచన

నల్లగొండ,ఆగస్ట్2 (ఆర్ఎన్ఎ): హరితహారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం పాఠశాలల్లో నిత్య పాఠ్యాంశం కావాలని విద్యాశాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అభిలషించారు. పాఠశాల స్థాయి నుంచే మొక్కల పెంపకం జీవితంలో భాగం కావాలన్నారు. ఇది విద్యార్థి,ఉపాధ్యాయులకు తప్పనిసరి కావాలని అన్నారు.

అమెరికా పర్యటనలో ఉన్న ఆయన స్కూలు విద్యార్థులకు సందేశం ఇచ్చారు. మొక్కలు పెంచడంలో ప్రైవేట్,ప్రభుత్వ పాఠశాలలు అన్న తేడా లేకుండా అందరూ భాగస్వాములు కావాలన్నారు. నాటిన మొక్కలు పెరిగి పెద్దవైతే మానవాళి మనుగడకు దోహదపడతాయని,భవిష్యత్‌కు నీడనిస్తాయని అన్నారు. ఈ సూత్రం ఆధారంగా టీచర్లు పిల్లను తర్ఫీదు చేయాలన్నారు. మొక్కల పెంపకం ఆవశ్యకతలను ప్రతి పాఠశాలలో వివరించాలని అన్నారు. మొక్కలు ఏ విధంగా నాటాలి, వాటికి నీరు ఏ విధంగా పోస్తే చక్కగా పెరుగుతాయో వారికి విశదీకరించాలని అన్నారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటడాన్ని దైనందిన కార్యక్రమంగా అలవర్చుకోవాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్క బ్రతికే విధంగా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లలతో మొక్కలు నాటించడంతో పాటు వాటిని రక్షించే విధంగా కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో, దేవాలయాల ప్రాంగణంలో మొక్కలను నాటించాలన్నారు. నాటిన ప్రతీ మొక్క జీవించే విధంగా పర్యవేక్షణ చేయాలని పిలుపునిచ్చారు. హరితహారంతో పాటు సిఎం కెసిఆర్ విద్యారంగానికి పెద్దపిట వేస్తున్నారని అన్నారు. బంగారు తెలంగాణ సాధనలో హరితహారం, ఉచిత విద్య కూడా భాగమేనని అన్నారు. ఇందుకోసం కేసీఆర్ వెంట నడిచి అనుకున్న లక్ష్యాన్ని చేరాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఉన్న అన్నిరంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్వప్నం కేజీ టు పీజీ విద్యాపథకం అమలుకు కార్యాచరణ మొదలైంది. ప్రభుత్వం గత రెండేండ్లుగా ఇందుకోసం బలమైన పునాదులు వేసింది. ఇకపై ఏటా పాఠశాలలు కళాశాలల సంఖ్యతోపాటు తరగతుల అప్‌గ్రెడేషన్ జరుపుతూ ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల వచ్చే రెండేండ్లలో కేజీ టు పీజీ విద్య పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందన్నారు. ఇంతకాలం సరైన విద్యకు నోచని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు ఉత్తమ విద్యకు మార్గం సుగమం అయ్యిందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో మానవవనరుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. ఉద్యమ సమయంలో తాను కలలుగన్న కేజీ టు పీజీ పథకానికి రూపమిచ్చారు. రాష్ట్రంలో 80 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నాణ్యమైన విద్యతో ఉద్యోగులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దినప్పుడే ఆ వర్గాల అభ్యున్నతి సాధ్యమని కేసీఆర్ విశ్వసించారు. ఈ మేరకు భారీ సంఖ్యలో రెసిడెన్సియల్ స్కూళ్లను ప్రారంభించారని అన్నారు. పాఠశాలల ద్వారా మెరుగైన ఫలితాలు కూడా వస్తున్నాయి. నిరుపేద కుటుంబాలనుంచి వచ్చిన విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం ఈ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా లభించిందని జగదీశ్వర్ రెడ్డి గుర్తు చేశారు.

## బిడిఎల్ ఉత్సవాల్లో పాల్గొననున్న రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): ఈ నెల 3వ తేదీ నుంచి భారత్ డైనమిక్స్ లిమిటెడ్ గోల్డెన్ జూబ్లి వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శనివారం హాజరుకానున్నారు.

రాజ్‌నాథ్ రాక సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పోలీసులు బందోబస్తు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు భానూరు యూనిట్‌లో పరిశ్రమలోని సిబ్బందితో గో÷-డలెన్ జూబ్లి సంబరాల్లో పాల్గొంటారు. ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రతలపై సిబ్బంది సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

క్రీడలు

# నేటి నుండి భారత్, వెస్టిండీస్ మధ్య సిరీస్

**- తొలి రెండు టీ20లు అమెరికాలోని ఫ్లోరిడాలో**

**- కోహ్లీ, రోహిత్ మధ్య విభేదాల నేపథ్యంలో.. సిరీస్‌పై అమితాసక్తి**

**నెల రోజుల పాటు విండీస్‌తో మ్యాచ్‌లు**

ముంబయి, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో టీమిండియా పేలవ ఓటమితో ఢీలాపడిన భారత అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నింపేందుకు సుదీర్ఘ సిరీస్ రాబోతోంది. వెస్టిండీస్‌తో శనివారం నుంచి భారత్ జట్టు మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్టుల్ని ఆడనుంది. తొలి రెండు టీ20 మ్యాచ్‌లు అమెరికాలోని ఫ్లోరిడా వేదికగా శని, ఆదివారం రాత్రి 8 గంటలకి వరుసగా జరగనుండగా.. ఆ తర్వాత విండీస్ గడ్డపై మిగిలిన మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. భారత కాలమాన ప్రకారం టీ20 మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటలకి ప్రారంభంకానుండగా.. మూడు వన్డేలు, తొలి టెస్టు మ్యాచ్ రాత్రి 7 గంటలకి, ఆఖరి టెస్టు మాత్రం రాత్రి 8 గంటలకి మొదలవుతుంది. ప్రపంచకప్ ఓటమి నేపథ్యంలో.. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో టీ20, వన్డే, టెస్టు జట్లు కళకళలాడుతున్నాయి. సీనియర్ వికెట్ కీపర్ మహేంద్రసింగ్ ధోనీ.. సైన్యంతో కలిసి పనిచేసేందుకు ఈ టూర్‌కి దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడంతో అతని స్థానంలో మూడు ఫార్మాట్లకీ వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్‌ని ఎంపిక చేశారు. ఇక ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా వన్డే, టీ20లకి రెస్ట్ కోరడంతో.. టెస్టులకి మాత్రమే అతడ్ని ఎంపిక చేశారు.

మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

తొలి టీ20 మ్యాచ్ ఆగస్టు 3న (ఫ్లోరిడా), రెండో టీ20 మ్యాచ్ ఆగస్టు 4న (ఫ్లోరిడా), మూడో టీ20 మ్యాచ్ ఆగస్టు 6న (గయానా), తొలి వన్డే మ్యాచ్ ఆగస్టు 8న (గయానా), రెండో వన్డే ఆగస్టు 11న (ట్రినిడాడ్), మూడో వన్డే ఆగస్టు 14న (ట్రినిడాడ్), తొలి టెస్టు మ్యాచ్ ఆగస్టు 22 నుంచి 26 వరకూ (ఆంటిగ్వా), రెండో టెస్టు ఆగస్టు 30నుంచి సెప్టెంబరు 3వరకూ (జమైకా) జరగనున్నాయి.

టీ20లకు భారత జట్టు ఇదే..

విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, మనీష్ పాండే, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), కృనాల్ పాండ్య, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, రాహుల్ చాహర్, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, దీపక్ చాహర్, నవ్‌దీప్ సైనీ

వన్డేలకు భారత జట్టు

విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, మనీష్ పాండే, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్, కేదార్ జాదవ్, మహమ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, నవ్‌దీప్ సైనీ

టెస్టులకు భారత జట్టు..

విరాట్ కోహ్లీ (కెప్టెన్), ఆజింక్య రహానె (వైస్ కెప్టెన్), మయాంక్ అగర్వాల్, కేఎల్ రాహుల్, చతేశ్వర్ పుజారా, హనుమ విహారి, రోహిత్ శర్మ, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), వృద్ధిమాన్ సాహా (ప్రత్యామ్నాయ వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ఇషాంత్ శర్మ, మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా, ఉమేశ్ యాదవ్

## కోహ్లీ అభిప్రాయాన్ని గౌరవించాల్సిందే

కోల్‌కతా: ప్రధాన కోచ్ ఎంపికలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీతో సహా ఎవరి అభిప్రాయాన్ని అయినా గౌరవించాల్సిందేనని క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) చీఫ్ కపిల్‌దేవ్ అన్నాడు. ఈ విషయంలో సీఏసీ సభ్యురాలు శాంతా రంగస్వామి నిర్ణయంతో తాను ఏకీభవిస్తున్నట్లు కపిల్ చెప్పుకొచ్చాడు. చీఫ్ కోచ్ ఎంపిక విషయంలో ప్యానెల్ శాయశక్తులా కృషి చేస్తుందని అన్నాడు. ప్రస్తుత ప్రధాన కోచ్ రవిశాస్త్రితో సహా సహాయక సిబ్బంది నియామకం కోసం బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. అయితే ఈస్ట్ బెంగాల్ క్లబ్ ఏర్పాటై 100 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కపిల్‌ను భారత్ గౌరవ్ పురస్కారంతో ఘనం గా సన్మానించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, గంగూ లీ, బైచుంగ్ భూటియా, సునీల్ ఛెత్రీ పాల్గొన్న ఈ కార్యక్రమం అనంతరం కపిల్ మీడియాతో మాట్లాడాడు. కోహ్లీతో సహా ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని మేము గౌరవిస్తాం. ఒక్కొకరికి ఒక్కో అభిప్రాయముంటుంది. వాటిని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటాం. సామర్థ్యం మేరకు పనిచేస్తే ఇది అంత కఠినమైన పనేం కాదు అని కపిల్ అన్నాడు. ఇదిలా ఉంటే ఈనెల మధ్య నాటికి కోచ్ ఎంపిక విషయంలో ఒక క్లారిటీ వచ్చే అవకాశముంది.

# భారత కోచ్ పదవికి పోటాపోటీ

**- 2000 దరఖాస్తులు అందినట్లు ప్రచారం**

బెంగళూరు, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : టీమిండియా ప్రధాన కోచ్ పదవికి దాదాపు 2000 దరఖాస్తులు వచ్చాయని ఓ ఆంగ్ల పత్రిక పేర్కొంది. అయితే ప్రస్తుత కోచ్ రవిశాస్త్రికి దీటుగా అందులో ఎవరూ పోటీకి లేరని ఆ పత్రిక రాసుకొచ్చింది. కోచింగ్‌లో అత్యుత్తమ అనుభవమున్న ఆస్ట్రేలియన్ ఆల్‌రౌండర్ టామ్‌మూడీతో పాటు న్యూజిలాండ్ మాజీ కోచ్, ప్రస్తుత కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ ప్రధాన కోచ్ మైక్ హెస్సన్ ఈ పదవికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది. మరోవైపు భారత్ నుంచి రాబిన్‌సింగ్, లాల్‌చంద్ రాజ్‌పుత్.. ఇద్దరే దరఖాస్తు చేసుకున్నారని పేర్కొంది. శ్రీలంక మాజీ కెప్టెన్, ముంబయి ఇండియన్స్ కోచ్ మహేలా జయవర్ధనే తొలుత ఈ పదవిపై ఆసక్తి కనబర్చినా ఇప్పుడు దరఖాస్తు చేయకపోవడం గమనార్హమని ఆ పత్రిక వెల్లడించింది. దక్షిణాఫ్రికా ఆల్‌టైమ్ ఫీల్డింగ్ స్టార్ జాంటీరోడ్స్ సైతం భారత ఫీల్డింగ్ కోచ్ పదవిపై ఆసక్తి కనబరుస్తున్నాడని, ఈ మేరకు అతడు దరఖాస్తు చేసుకున్నాడని తెలిపింది. ప్రస్తుతమున్న రవిశాస్త్రి పదవీకాలం ప్రపంచకప్‌తోనే పూర్తైన విషయం తెలిసిందే. వెస్టిండీస్ పర్యటన వరకూ అతడి పదవీకాలాన్ని బీసీసీఐ ఇటీవల పొడిగించింది.



### నయీం కేసులో..

# టీఆర్ఎస్ పెద్దల పేర్లను దాచిపెట్టారు

**- సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్న కేసీఆర్**

**- బీజేపీ నేతలు విషయాన్ని కేంద్రంపై దృష్టికి తీసుకెళ్లాలి**

**- కేంద్ర హోంశాఖ ద్వారా విచారణ జరిపించాలి**

**- అప్పుడే నయీమ్ పేరుతో జరిగే నాటకానికి తెర పడుతుంది**

**- ఫేస్‌బుక్‌లో కాంగ్రెస్ నేత విజయశాంతి**

హైదరాబాద్, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : నయీం కేసులో టీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్ద పేర్లను బయటకు రాకుండా దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి అన్నారు. గ్యాంగ్ స్టర్ నయీమ్ కేసులోని వివరాలను గురువారం ఆర్టీఐ చట్టం కింద ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కింద బయటకు తీసుకురాగా, ఆ గ్యాంగ్‌లో భాగమైన అసలు టీఆర్ఎస్ నేతల పేర్లు బయటకు రాకుండా కేసీఆర్ సర్కారు జాగ్రత్త పడిందని విజయశాంతి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం తన ఫేస్ బుక్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్ ప్రభుత్వం మరో నాటకాన్ని మొదలు పెట్టిందని విమర్శలు గుప్పించారు. గ్యాంగ్ స్టర్ నయిం డైరీలో ప్రస్తావించిన పేర్లు అనే అంశం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని మరోసారి కుదిపేస్తోంది. ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఇలాంటి నాటకాలు ఆడటం ఇది కొత్త కాదని విజయశాంతి పేర్కొన్నారు. నయీమ్ డైరీ లో పేర్కొన్న పేర్లకు సంబంధించి వివరాలు పత్రికల్లో వచ్చాయని, కానీ ఈ వివరాలలో కూడా చాలావరకు ఎడిటింగ్ జరిగినట్టు కనిపిస్తోందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా నయీమ్ తో సంబంధాలు ఉన్న అధికారులు ఇతర పార్టీ నేతల వివరాలు వెల్లడించిన టిఆర్ఎస్ ప్రభుత్వం... తమ పార్టీకి సంబంధించిన కీలక నేతల వివరాలను ఎందుకు బయట పెట్టలేదని ఆమె ప్రశ్నించారు. ఎందుకు ఉద్దేశపూర్వకంగా కొందరి పేర్లను మాత్రమే బయటకు లీక్ చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నయీమ్ తో మొదటి నుంచి లింకులు ఉన్న కొందరు నేతలకు టిఆర్ఎస్ పెద్దలు అభయ హస్తం ఇచ్చి... నయీమ్ ద్వారా దోచుకున్న సొమ్ము లో వాటా కూడా తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. నయీమ్ తో సన్నిహితంగా మెలిగిన కొందరు ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్ హై కమాండ్ అండతో కీలక పదవులను అనుభవిస్తూనే ఉన్నారని, మరి వాళ్ళ పేరు ఎందుకు ప్రస్తావనకు రాలేదని విజయశాంతి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగే అరాచకాలపై కేంద్రం దృష్టి సారించిందని పదేపదే చెబుతున్న బీజేపీ నేతలు.. నయీమ్ వ్యవహారంపై అసలు నిజాలు వెలుగు లోకి వచ్చేందుకు కేంద్ర హోంశాఖ ద్వారా విచారణ జరిపించాలని, తద్వారా టిఆర్ఎస్ బండారం బయట పడే అవకాశం ఉంటుందని, నయీమ్ పేరుతో జరిగే నాటకానికి తెర పడుతుందని విజయశాంతి అన్నారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో..

# కిడ్నాప్ కలకలం

**- ముగ్గురు పిల్లల్ని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన క్యాబ్ డ్రైవర్**

**- పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు**

హైదరాబాద్, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కిడ్నాప్ కలకలం రేపింది. ఓ క్యాబ్ డ్రైవర్ ముగ్గురు పిల్లల్ని కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. దీంతో అతన్ని వెంబడి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ కుటుంబం ఇంటికి వెళ్లేందుకు రెండు క్యాబ్‌లు బుక్ చేసుకుంది. తల్లిదండ్రులు తొలుత మగ్గురు పిల్లలను ఒక క్యాబ్‌లో ఎక్కించారు. తరువాతి క్యాబ్‌లో తల్లిదండ్రులు బయలుదేరారు. అయితే పిల్లలు ఉన్న క్యాబ్ డ్రైవర్.. పారిపోయేందుకు ప్రయత్నించాడు. కారును అక్కడి నుంచి వేగంగా తీసుకెళ్లాడు. దీంతో కారులోని చిన్నారులు కేకలు వేయడంతో.. కంగారు పడ్డ తల్లిదండ్రులు.. వెనుకాల కారుతో క్యాబ్‌ను వెంబడించారు. దీంతో కొద్దిదూరం వెళ్లిన క్యాబ్ డ్రైవర్ పిల్లల్ని, లగేజ్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. అయితే డ్రైవర్‌తో పాటు క్యాబ్‌లో ఉన్న అతడి స్నేహితుడిని మాత్రం పిల్లల తల్లిదండ్రులు పట్టుకున్నారు. అనంతరం అతన్ని శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నవోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. క్యాబ్ డ్రైవర్ వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

# తమిళనాట రూ.130కి తగ్గిన కేబుల్ టీవీ చార్జీలు

## ఈ నెల 10 నుంచి అమలుకానున్న ఆదేశాలు

చెన్నై,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ నెలచార్జీని రూ.130కి తగ్గించింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఈ కొత్త చార్జీలు అమలుకు వస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు తక్కువ చార్జీతో కేబుల్ టీవీ సేవలు పొందేలా ప్రభుత్వ కేబుల్ సంస్థకు 2011లో జయలలిత పునరుజ్జీవనం కల్పించారు. చందాదారులకు ప్రతి నెలా రూ.70 చార్జీతో 100 చానెళ్లు ప్రసారం చేశారు. అనంతరం కేబుల్ ప్రసారాలు స్పష్టంగా ప్రజలు తిలకించేలా కేంద్ర ప్రభుత్వం నుంచి డిజిటల్ ప్రసార హక్కును పొంది 2017 సెప్టెంబరు 1వ తేదీన డిజిటల్ ప్రసారాలు ప్రారంభమయ్యాయి. కేబుల్ టీవీ సంస్థ ఇప్పటి వరకు 36లక్షల సెటాప్ బాక్స్‌లను కొనుగోలు చేసి 35.12 లక్షల మంది చందాదారులకు ఉచితంగా అందజేసింది. ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా ఇష్టపడే చానళ్లను జీఎస్‌టీతో కలిసి రూ.220 చార్జీతో 191 చానెళ్లను ప్రసారం చేస్తున్నారు. ఈ చార్జీని తగ్గించాలన్న ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం రూ.130కి తగ్గించింది.

# జన సందోహంగా కేతకీ సంగమేశ్వరాలయం



ఝరాసంగం, ఆగస్టు 2 : దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరస్వామి దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు రాక ప్రారంభమైంది. అమృత గుండంలో పుణ్యస్నానాలు చేశారు. భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బీదర్, కామారెడ్డి జిల్లావాసులు విజయ్‌కుమార్, భగవాన్, సంతోశ్ భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ, చైర్మన్ నరసింహాగౌడ్, కార్యనిర్వహణాధికారి మోహన్‌రెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

**కేతకీ సంగమేశ్వరాలయంకు ఎలా వెళ్లాలంటే**

హైదరాబాద్ నుంచి 116 కిలో మీటర్ల దూరంలో ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం ఉంది. జిల్లాలోనే ఈ ఆలయం అతి పెద్దది. శ్రావణ మాసం ప్రారంభం నుంచి చివరి వరకు అనునిత్యం భారీ సంఖ్యలో తరలిచ్చి పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ప్రత్యేక వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో ఆలయానికి భక్తులు చేరుకుంటారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

**కేతకీలో శ్రావణ మాసం విశిష్ట పూజలు**

స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పూర్వక ఏకిదశి రుద్రాభిషేకం, రుత్విక్కరణ, వల్లకీసేవ, రుద్రస్వాహకార, నవగ్రహ శాంతి హోమం, భక్తులతో అమృత గుండలోని జలలింగానికి ప్రత్యేక పూజ లు, ప్రతినిత్యం భక్తులకు అన్నదానం, రాత్రికి సేవ భజనలు ఉంటాయి. ముగింపు రోజు స్వామివారికి కుంకుమార్చన రాత్రికి పల్లకీసేవ, భజనలు, చేసి భక్తులతోపాటు గ్రామస్తులకు అన్నదానం ఉంటుంది.

# వారిద్దరి వల్ల వచ్చేనష్టం లేదు

**బిజెపిని ఎవరూ ఏమీ చేయలేరు: బండి**

న్యూఢిల్లీ,ఆగస్ట్2(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్-జగన్ తరచూ భేటీలవుతున్న సందర్భంలో బిజెపికి అడ్డుకట్ట వేసేందుకు చర్చిస్తున్నారన్నప్రచారంపై బిజెపి ఎంపి స్పందించారు. వీరి కలయిక వల్ల బిజెపికి వచ్చేనష్టం లేదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా జరిగిన భేటీలో తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి అడ్డుకట్ట వేయాలని చర్చించినట్లు పెద్ద ఎత్తున వార్తా పత్రికలు, టీవీ చానెళ్లలో ప్రత్యేక కథనాలు రావడంపై ఆయన స్పందిచారు. ఈ వరుస భేటీలు, కథనాలపై జగన్, కేసీఆర్ ఎన్నిసార్లు భేటీ అయినా బీజేపీని ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. స్వప్రయోజనాల కోసమే వారిద్దరు కలుస్తున్నారని చెప్పారు. ఉద్యమ సమయంలో ఒకలా.. అధికారంలోకి రాగానే మరోలా కేసీఆర్ వ్యవహరిసున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ తుపాకీ రాముడు, మాయలఫకీర్ వేషాలతో ప్రజలను మోసగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఫెడరల్ ఫ్రంట్ పేరుతో నాటకాలు ఆడిన కేసీఆర్.. ఇప్పుడు కొత్త డ్రామా మొదలు పెట్టారని ఫైరయ్యారు. కేసీఆర్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇక జగన్.. హైదరాబాద్ నగర్ చుట్టుపక్కల ఉన్న భూదందాలు బయటకు రాకుండా ఉండేందుకే కేసీఆర్‌ను కలుస్తున్నారని విమర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ గురువారం ప్రగతి భవన్‌లో ఏకాంతంగా సమావేశమయ్యారు. దాదాపు మూడు గంటల పాటు ఇద్దరే మాట్లాడుకున్నారు. వారిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చ సాగింది. వారిద్దరి మధ్య చర్చ ఏమై ఉంటుందని ఇరు రాష్ట్రాల్లోని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రెండు రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేసే ప్రమాదం ఉందని ఇద్దరు సిఎంలు అభిప్రాయపడ్డట్లు సమాచారం.

## ఈ నెల 3 నుంచి బీడీఎల్ గోల్డెన్‌జూబ్లీ వార్షికోత్సవాలు

పటాన్‌చెరు, ,ఆగస్ట్2: ఈ నెల 3వ తేదీ నుంచి భారత్ డైనమిక్స్ లిమిటెడ్ గోల్డెన్‌జూబ్లి వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు భానూరు యూనిట్‌లో పరిశ్రమలోని సిబ్బందితో గోల్డెన్ జూబ్లి సంబరాల్లో పాల్గొంటారు. ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రతలపై సిబ్బంది సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

# 25 గెటప్స్‌లో విక్రమ్..!



ఏ పాత్రనైన అవలీలగా పోషించగల నటులలో విక్రమ్ ఒకరు. ప్రతి సినిమాను తొలి సినిమాగా ఫీలై ప్రాణం పెట్టి చేస్తాడు. అయితే ఈ మధ్య విక్రమ్‌ని సరైన సక్సెస్‌లు పలకరించడం లేదు. రీసెంట్‌గా మిస్టర్ కెకె అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు.

ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కోట్టింది. త్వరలో అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తన 58వ చిత్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. 7స్క్రీన్ స్టూడియోస్, వయకామ్ 18 స్టూడియోస్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టులో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఏప్రిల్ 2020లో విడుదల చేయాలని చూస్తున్నారు.

ఈ చిత్రంలో విక్రమ్ దాదాపు 25 గెటప్స్ పోషించనున్నాడట. కమల్ హాసన్ తర్వాత మళ్లీ అన్నీ పాత్రలని విక్రమ్ పోషించనున్నాడు. ఇప్పటికే అమెరికాకు చెందిన ఓ కంపెనీ ఆయన మేకప్, గెటప్‌లకు డిజైన్లు రెడీ చేస్తోందని సమాచారం. ఇది పాన్ ఇండియా సినిమా. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేస్తాం. వయకామ్ 18 మోషన్ పిక్చర్స్‌తో కలిసి భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నాం. చిత్ర పరిశ్రమలోని ప్రముఖ టెక్నీషియన్లు ఇందుకోసం పనిచేయనున్నారు' అని 7స్క్రీన్ స్టూడియోస్ ఇటీవల తెలిపింది. గతంలో ఎన్నడు పోషించని పాత్రలలో విక్రమ్ కనిపిస్తుండగా, ఆది ఆయనకి ఛాలెంజింగ్‌గానే ఉంటుందని అంటున్నారు.

# రెండు పాత్రలతో సందడి చేయనున్న చిరు

మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం సైరా నరసింహారెడ్డి. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం దసరా కానుకగా విడుదల కానుందని తెలుస్తుంది. ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే మరి కొద్ది రోజులలో చిరు 152వ చిత్రం ప్రారంభం కానుండగా, ఈ సినిమాకి సంబంధించి పలు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. నక్సలిజం బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ చిత్రంలో చిరు రెండు పాత్రలలో సందడి చేయనున్నాడట. ఓ పాత్ర కోసం చిరు ఓ పాత్రలో నెరిసిన జుట్టుతో కనిపిస్తాడట. ప్రస్తుతం ఆయన ఈ చిత్రం కోసం తన లుక్‌ని కూడా పూర్తిగా మార్చుకుంటున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించనున్న ఈ సినిమాలో నయనతారని కథానాయికగా ఎంపిక చేయాలనుకుంటున్నారట. చిరంజీవి పుట్టిన రోజున (ఆగస్ట్ 22) ఈ సినిమా ప్రారంభం కానుందని తెలిసింది. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తారట. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారు.

# 'వెంకీమామ' మేకింగ్ వీడియో విడుదల

సినిమా

వెంకటేష్, నాగ చైతన్య కథానాయకులుగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వెంకీమామ'. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమాకు సంబంధించి అభిమానులకు సడెన్ సర్‌ప్రైజ్ ఇచ్చింది చిత్ర బృందం. బాబీ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ఇద్దరు కథానాయకులు ఒకే ఫ్రేమ్‌లో దర్శనమిచ్చారు. దీంతో అభిమానుల్లో జోష్ పెరిగింది. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై వస్తున్న ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, రాశీఖన్నా కథానాయికలు. తమన్ సంగీతం అందిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను జనవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# కోరమీసంతో రామ్ చరణ్... ఫోటోలు వైరల్

మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ అతి తక్కువ కాలంలోనే స్టార్ స్టేటస్ అందుకున్నాడు. మాస్, క్లాస్ చిత్రాలే కాకుండా చారిత్రాత్మక చిత్రాలలోను నటించి ఓ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ఆర్ఆర్ఆర్ అనే క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ఇందులో అల్లూరి సీతారామరాజు పాత్రలో చరణ్ కనిపించనున్నాడు. ఆయనకి జోడీగా అలియా భట్ నటించనుంది. భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఎలాంటి లీకులు జరగకుండా దర్శక నిర్మాతలు చాలా జాగ్రత్తపడుతున్నారు. ఆ మధ్య చిత్ర విశేషాలని వివరించడం కోసం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తమ పూర్తి లుక్ రివీల్ కాకుండా ఎన్టీఆర్, రామ్ చరణ్ టోపీలతో కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవలి కాలంలో వీరిద్దరు కెమెరాకి చిక్కిన సందర్భాలు కూడా చాలా తక్కువే.

ముంబాయిలో జరిగిన కియారా అద్వానీ బర్త్ డే పార్టీలో బాలీవుడ్ ప్రముఖులు సందడి చేసారు. ఈ వేడుకకు కబీర్ సింగ్ హీరో షాహిద్ కపూర్‌తో పాటు సిద్దార్థ్ మల్హోత్ర, కరణ్ జోహార్ వంటి వాళ్లు హాజరయ్యారు. ఈ వేడుకకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. స్పెషల్ గెస్ట్‌గా హాజరయ్యాడు. కోరమీసంతో బ్లాక్ డ్రెస్‌లో దర్శనమిచ్చాడు. ఆయన లుక్ కిరాక్ పుట్టిస్తుంది. అభిమానులు చరణ్‌ని చూసి సంబరపడిపోతున్నారు. ఈ లుక్ అభిమానుల్ని ఆకట్టుకుంది. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. చెర్రీ లుక్ బాగుందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. బోయపాటి దర్శకత్వంలో తెరకెక్కిన వినయ విధేయ రామ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా కథానాయికగా నటించిన విషయం విదితమే. వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి రెస్పాన్స్ వచ్చింది.

## మళ్లీ మొదటికొచ్చిన..

# అయోధ్య వివాదం

**– పరిష్కారం చూపలేక పోయిన మధ్యవర్తుల కమిటీ**

**– 6నుంచి రోజువారి విచారణకు సుప్రీం నిర్ణయం**

న్యూఢిల్లీ, ఆగస్టు2(ఆర్ఎన్ఎ) : అయోధ్య రామజన్మభూమి వివాదం మళ్లీ మొదటికొచ్చింది. వివాద పరిష్కారం కోసం మధ్య వర్తిత్వం కమిటీ వేసినప్పటికీ.. పరిష్కారం చూపడంలో కమిటీ ప్రయత్నాలువిఫలమయ్యాయి. మధ్యవర్తుల కమిటీని గురువారం సుప్రీంకోర్టులో సమర్పించగా, శుక్రవారం సుప్రీం కోర్టు విచారించింది. నివేదికను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎఫ్ఎంఐ కలీఫుల్లా నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ పరిశీలించిన తర్వాత శుక్రవారం సుప్రీంకోర్టు ఈ ప్రకటన చేసింది. దీనిపై రోజువారీ విచారణ ఈ నెల6 నుంచి జరుగుతుందని తెలిపింది. త్రిసభ్య కమిటీ గురువారం సీల్డు కవర్లో సమర్పించిన నివేదికను ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం పరిశీలించింది. ఈ రాజ్యాంగ ధర్మాసనంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ ఏ బాబ్డే, జస్టిస్ డీ వై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ ఏ నజీర్ ఉన్నారు. అయోధ్య రామ జన్మ భూమి వివాదంపై మధ్యవర్తిత్వం నిర్వహించిన త్రిసభ్య కమిటీ నివేదికను గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా గోప్యంగా ఉంచుతామని సుప్రీంకోర్టు పేర్కొంది. మధ్యవర్తిత్వం ఎటువంటి ఫలితాన్ని సాధించలేక పోయిందని, విఫలమైందని స్పష్టం చేసింది. కేసులోని ముస్లిం పక్షం వినిపించిన వాదనలో బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యం స్వామి రిట్ పిటిషన్‌ను వ్యతిరేకించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ విచారణ ప్రారంభం కానివ్వాలన్నారు. కేసులో వాదనలు వినిపించేందుకు ఎందుకు సిద్ధమవడం లేదని, కోర్టు చేస్తున్నవనిని ఎందుకు ప్రశ్నిస్తున్నారని అడిగారు. అయోధ్య భూ వివాదంపై 2010 లో అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డ్, నిర్మోహి అఖాడా, రామ్ లల్లాలకు సరిసమానంగా పంచాలని తీర్పులో పేర్కొంది. దీనిపై 14 అపీళ్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి.

ధ్యవర్తిత్వ కమిటీలో జస్టిస్ కలీఫుల్లాతోపాటు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు శ్రీ శ్రీ రవిశంకర్, సీనియర్ అడ్వకేట్ శ్రీరామ్ పంచు ఉన్నారు. మార్చి 8 నుంచి ÷జాబాద్‌లో మధ్యవర్తిత్వ ప్రక్రియ జరిగింది. వివిధ వర్గాలతో ఈ కమిటీ చాలా సమావేశాలు నిర్వహించింది. మధ్యవర్తిత్వ ప్రయత్నాల వల్ల ప్రయోజనం లేదని, విచారణ ప్రారంభించాలని ఒరిజినల్ లిటిగెంట్స్‌లో ఒకరైన గోపాల్ సింగ్ విశారద్ వారసుడు రాజేంద్ర సింగ్ కోరడంతో సుప్రీంకోర్టు ఈ కమిటీ నివేదికను సమర్పించాలని కోరిన సంగతి తెలిసిందే.

# లక్ష్య సాధనకు నిరంతర శ్రమ అవసరం

**-ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి**




మహబూబాబాద్, ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి): యువతకు 20 నుంచి 25 ఏళ్ల వయసు ఎంతో కీలకమని, ఈ వయసులో సమయాన్ని వృథా చేయకుండా జీవితంలో స్థిరపడేందుకు గట్టి పునాదులను ఏర్పరుచుకోవాలని జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో ఇటీవల ఎస్సై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొర్రూరు సీఐ వి.చేరాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. చదువుకునే వయసులోనే జీవితంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని నిరంతరం శ్రమించాలన్నారు. తమలోని ప్రతిభను బయటకు తీసి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం డీఎస్పీ మదన్‌లాల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు, సినిమాలు వంటి వ్యాపకాలను పక్కనపెట్టి లక్ష్యాన్ని చేరుకునే వరకు శ్రమించాలన్నారు. అనంతరం ఎస్సై ఉద్యోగాలు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి శాఖ కళాకారులు పాటలతో విద్యార్థులను హుషారెత్తించారు. అంతకుముందు ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ అనుభవాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మదనలాల్, తొర్రూరు, మరిపెడ సీఐలు చేరాలు, కరుణాకర్, ఎస్సైలు సీహెచ్. నగేష్, రాంచరణ్, నందీప్‌తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

మహబూబాబాద్, ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి):ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న తప్పుల సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పలు పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 31 దాకా ఓటర్ల జాబితాను పరిశీలించి వాటిలో తమ పేర్లు, చిరునామా, ఇతర పొరపాట్లను సవరించుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 31 దాకా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోల వద్ద, తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. సమగ్ర ఓటర్ల జాబితా అక్టోబరు 15న ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15 నుంచి 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి నవంబరు 2 నుంచి పదో తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 31 నాటికి ఓటర్ల తుది జాబితాను రూపొందించి, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2020 జనవరి 1 నుంచి 15 లోగా ప్రచురిస్తామని తెలిపారు. వీటిపై వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను నియమించుకొని సవరణలకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు.

# సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకంపై మహేష్ ప్రశంసలు

హైదరాబాద్, ఆగష్టు 2:పుస్తక రచయిత, ఐఏయస్ అధికారి బుర్రా వెంకటేశం రచించిన "Selfie of Success" పుస్తక ప్రియులని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఎందరో ప్రముఖులు ఈ పుస్తకంపై ప్రశంసలు కురిపించారు. అమెజాన్ ఆన్ లైన్ అమ్మకాలలో నెంబర్ 1 స్థానంలో నిలిచింది. ఈ పుస్తకం థీమ్ మహేష్ తాజాగా నటించిన మహర్షి చిత్ర థీమ్‌కి దగ్గరగా ఉండడంతో ఆయన తన ట్విట్టర్ ద్వారా ప్రశంసలు కురిపించారు. "Selfie of Success" అనే పుస్తకమును ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకంగా అభివర్ణించారు.

సెల్ఫీ ఆఫ్ సక్సెస్ అనేది మనిషి యొక్క లోతైన ప్రయాణం మరియు అతని విజయాన్ని సాధించడం గురించి సమగ్రంగా చర్చించారని పేర్కొన్నారు .విజయం మనిషి జీవితంలో ఒక ప్రయాణంగా ఉండాలని వివరంగా తన అభిప్రాయాలను వెల్లడించిన పుస్తక రచయిత బుర్రా వెంకటేశంకి అభినందనలు తెలిపారు మహేష్. సెల్ఫీ ఆఫ్ సక్సెస్‌లో మహర్షి ఇతివృత్తంకి సంబంధించిన చాలా అంశాలు ఉన్నాయని అన్నాడు. ఈ బుక్‌పై విక్టరీ వెంకటేష్, ప్రభాస్ కూడా ప్రశంసలు కురిపించారు.

## చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్న కర్ణాటక సీఎం..

బెంగళూరు, ఆగష్టు 2: కర్ణాటక సీఎం యడియూరప్ప తన కుటుంబసభ్యులతో కలిసి నిన్నరాత్రి శ్రీత్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమంలో బస చేశారు. ఆశ్రమంలో యడియూరప్ప ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అత్యవసర సమావేశాలు ఉన్నందున తిరిగి బెంగళూరు వెళ్లాల్సి ఉంది.

మరో 15-20 రోజుల తర్వాత మళ్లీ వస్తా. ఇక్కడ కొన్ని ప్రాంతాలను సందర్శించాల్సి ఉందని ఈ సందర్భంగా సీఎం యడియూరప్ప అన్నారు.

# అమర్‌నాథ్ రూట్లో ల్యాండ్‌మైన్లు.. యాత్రికులపై పాక్ టార్గెట్




హైదరాబాద్, ఆగష్టు 2: పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు.. భారీ కుట్రకు ప్లానేశారు. కశ్మీర్‌లో జరుగుతున్న అమర్‌నాథ్ యాత్రకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. పాకిస్థాన్ ఆర్మీ సహాయంతో అక్కడి ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్రికులను భయకంపితులకు గురిచేస్తున్నట్లు భారతీయ ఆర్మీ వెల్లడించింది. గత నాలుగైదు రోజుల నుంచి ఇంటెలిజెన్స్ సమాచారం అందుతోందని, పాక్ ఆర్మీ సాయంతో ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్రను అడ్డుకుంటున్నట్లు తెలిసిందని, దీనిలో భాగంగా యాత్ర రూట్లో గాలింపులు చేపట్టామని చిన్నార్ కార్ప్స్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ కేజీఎస్ ధిల్లాన్ తెలిపారు.

అయితే తమ గాలింపుల్లో పాక్‌కు చెందిన ల్యాండ్‌మైన్లు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు లెఫ్టినంట్ జనరల్ ధిల్లాన్ చెప్పారు. ఐఈడీలు, నాటు బాంబులు అమర్‌నాథ్ రూట్లో దొరికినట్లు ఆర్మీ వర్గాలు చెప్పాయి. ఇంకా ఆ రూట్లో విస్తృతంగా గాలింపు జరుగుతున్నట్లు ఆర్మీ తెలిపింది. కశ్మీర్‌లో ఉన్న శాంతి పరిస్థితులను చెదరగొట్టేందుకు పాక్ ఆర్మీ ప్రయత్నిస్తోందని జనరల్ ధిల్లాన్ ఆరోపించారు. ఇలాంటి వాటిని అడ్డుకుంటామన్నారు.

# నయీమ్ వ్యవహారంలో నేతలపై చర్యలుతీసుకోవాలి

**మాటల గారడితో కెసిఆర్ పాలన**

**బిజెపి చొరవతోనే బీబీనగర్‌కు ఎయిమ్స్**

**మీడియా సమావేశంలో బండారు దత్తాత్రేయ**

భువనగిరి,ఆగస్టు2 (ఆర్ఎన్ఎ): నయీమ్ కేసులో బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని మాజీ కేంద్రమంత్రి, బిజెపినేత బండారు దత్తాత్రేయ అన్నారు. నయీం వ్యవహారంలో బయటకువచ్చిన వారిపై పేర్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నయీమ్ కేసులో సమాచార హక్కు చట్టం ద్వారా బయటికి వచ్చిన అధికార పార్టీ నాయకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కేసులో వెంటనే విచారణ జరిపించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్టు తెలిపారు. మాటల గారడితో ముఖ్యమంత్రి పరిపాలన సాగిస్తున్నారన్న దత్తాత్రేయ.. ఎన్నికలు అయిపోయిన నాటి నుంచి టిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక ప్రారంభమైందని అన్నారు. ఎయిమ్స్ విషయంలో తాను అటల్ బిహారీ వాజ్ పైతో మాట్లాడానని, మోడీ ప్రభుత్వం వల్లే తెలంగాణ ప్రాంతానికి ఎయిమ్స్ వచ్చిందని దత్తాత్రేయ అన్నారు. త్వరలో పేదలకు మంచి వైద్యం అందబోతుందని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి ఎయిమ్స్‌ను త్వరగా పూర్తి చేయాలని కొరతానన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని తెలంగాణలో అమలు చేయాలని కోరుతున్నానని తెలిపారు. ఎయిమ్స్ రాకతో భువనగిరి, బీబీనగర్ పెద్ద పట్టణాలు కాబోతున్నాయని, అభివృద్ధి జరగనుందని ఆయన అన్నారు. ఎయిమ్స్ విషయంలోబూర నర్సయ్య గౌడ్ కృషి ని అభినందిస్తున్నానని దత్తాత్రేయ తెలిపారు.భువనగిరి ని తప్పకుండా పర్యాటక కేంద్రం గా అభివృద్ధి చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు దత్తాత్రేయ. మోడీ చేసిన వాగ్దానాలు అమలు చేస్తుంటే.. టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీ లను మరచి పోతోందన్నారు.ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com